# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ : (0863) 2293280, 2293206

web: www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము

గూడూరి వెంకటరత్నం

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ ఎస్.రామతారక పరబ్రహ్మశాస్త్రి

మిస్.పి. ఇందిరాదేవి

డా॥ వి.వి.ఆర్. ప్రసాదరావు

డా॥ యమ్.స్వర్ణముఖి



Volume 30 Issue 11

No.of Pages 40

JULY 2011

| | | |
|---|---|---|
| 5సం॥లచందా | రు. | 250.00 |
| 2సం॥ల చందా | రు. | 120.00 |
| సంవత్సర చందా | రు. | 60.00 |
| విడిప్రతి వెల ..... .. | రు. | 5.00 |

బ్యాంక్ డ్రాఫ్ట్ A/C.Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ పేరులో డ్రా చేయుండి. M.O.,బ్యాంక్ డ్రాఫ్ట్ పంపవలసిన చిరునామా:

మేనేజరు

సమర్థసద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్-522508

Printed, Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL


## ఈ సంచికలో.... పేజీ


| ఈ సంచికలో.... | పేజీ |
|---|---|
| భద్రవాక్యం | 2 |
| అమ్మఆశీస్సులు | 3 |
| బాబూజీ ఉవాచ | 4 |
| మాతాజీ అభిభాషణ | 7 |
| సన్నిధిలో సంభాషణ | 11 |
| శ్రీకాళీగార్డెన్స్‌లో కార్యక్రమాలు | 14 |
| శ్రీగురుదక్షిణ | 15 |
| శ్రీగురు కృపాహి కేవలమ్ | 17 |
| శ్రీకృష్ణ కర్ణామృతం | 19 |
| పరిప్రశ్నేన సేవయా | 21 |
| శ్రీబాబూజీ దివ్యవాణి | 23 |
| భగవత్సాక్షాత్కారము | 25 |
| గురు సన్నిధి | 27 |
| సమర్థ సద్గురు నాథుని దివ్యచరిత్ర | 29 |
| మౌనధ్యాన సప్తాహ శిబిరం | 32 |
| శత్రువుల పట్ల ఉదాత్తమైన కృప | 34 |
| వార్తలు - విశేషాలు | 36 |
| శ్యామసుందరా! ఒక్కసారి! | 38 |

## భద్రవాక్యం

-రమణ ప్రసాద్

**అకర్తృత్వమ భోక్తృత్వం స్వాత్మనో మన్యతే యదా ।**
**తదాక్షీణా భవన్త్యేవ సమస్తాశ్చిత్త వృత్తయః ॥**
**- అష్టావక్రగీత**

ఎవరైతే ఆత్మకు కర్తృత్వం భోక్తృత్వం లేదని తెలిసికొంటాడో అతడు సంపూర్ణంగా వృత్తి రహితుడవుతున్నాడు. అలాకాకుండా ప్రతిదానిని "ఇది నేను చేస్తున్నాను, ఈ ఫలమును నేను అనుభవిస్తున్నాను" అని భావిస్తాడో అతడు వృత్తి సహితుడవుతున్నాడు. కర్తృత్వ భోక్తృత్వాభిమానం లేనివానికి సర్వ వృత్తులు శాంతించినందున ఆత్మ శాంతిని పొందుతున్నాడు.

అయితే ఇక్కడ ఒక ప్రశ్న వస్తుంది - "కేవలం నేను అకర్తను, అభోక్తను అనుకొన్నంత మాత్రాన జీవన్ముక్తుడు అయిపోతాడా?" అని. బద్ధ జీవుడు నేను 'అకర్తను, అభోక్తను' అనుకొన్నంత మాత్రాన అతనికి వృత్తి నిరోధము కాజాలదు. అతడు పైకి అలా చెప్పుకొన్నా, లోపల మాత్రం పిల్లివలె విషయ భోగములందు దృష్టి కలుగుతూనే ఉంటుంది.

కానీ 'నేను అకర్తను, అభోక్తను' అను నిశ్చయముగల జ్ఞాని యొక్క మనస్సు స్వప్నంలో కూడా యితర విషయాదుల మీదకి పోదు. దీనికి దృష్టాంతము యేమన - హిందూ ధర్మము గో మాంసమును మిక్కిలి నిషేధించుచున్నది. అందువలన యే హిందువుని మనస్సు స్వప్నంలో కూడా గోమాంసం పైకి పోదు. కాని మిధ్యా జ్ఞానికి విషయములు యెదుట పడనంత వరకే వాని నిశ్చయము. విషయ రూపమగు ఎలుక దగ్గరకు వస్తే వెంటనే తానే కర్తా, తానే భోక్తా అయి దానిని అనుభవిస్తాడు.

*

# అమ్మ ఆశీస్సులు

గురునామ జపాద్దేవి బహు జన్మార్జితావ్యపి ।
పాపాని విలయం యాంతి నాస్తి సందేహ మన్వపి ॥

(గు.గీ 297శ్లో)

"శ్రీగురుదేవుని నామం చేయటం వలన ఓ దేవీ! అనేక జన్మములందు జేసిన పాపములైనను నాశనము పొందుచున్నవి. ఈ విషయమున అణుమాత్రమైన సందేహము లేదు." అని సాక్షాత్తు పరమేశ్వరుడు పార్వతిదేవికి చెప్పియున్నాడు.

ఎక్కడైతే నామ జపము, ధ్యానము, సంకీర్తనాదులు జరుగునో అక్కడ వారికి నామమునకు, నామి వేరు గాడు కదా! అలా భగవన్నామము చేయగా చేయగా భక్తిలో మనస్సు మరుగైపోయి తన అనుభవమే సిద్ధిస్తుంది. నీవు చూచినదెల్ల నీవయే అన్నది ద్రష్ట, దర్శన, దృశ్యాది భావము శూన్యైక వస్తువు నిరాకార నిరంజనమై భేదము ఎక్కడ ఉంటుంది. కనుకనే ఎందరెందరో మహానుభావులు, మహాత్ములు, భక్తులు జ్ఞానులు మనకందించే ఉన్నారు. అట్టి దాని యందు నిలబడి ఉంటే చాలు. మార్గాలు ఎన్నైనా గమ్యము మాత్రము ఒక్కటే. అది తనయందే ఉన్నాడని ఎరుక పరచి సందేహ నివృత్తి చేసిన శ్రీసద్గురుదేవులు కృప ఎంత గొప్పదో అది సమర్థులైన శ్రీగురుపాదాశ్రయము చేసిన వారందరికీ విదితమే కదా! అట్టి శ్రీగురుపూర్ణిమను వెతుక్కుంటూ ఆషాఢమాసము వచ్చేసింది. ఆశాపాశములను రహితం చేసి, బంధవిముక్తులుగా చేయుటకై శ్రీగురు పద సన్నిధి మనందరికీ లభించింది. శ్రీగురు భక్తులైన ప్రతీ భక్తునికీ..............

**బరసత్ బరసత్ సద్గురు కృపా । ఆనంద్ ఆనంద్ ఆనంద్‌హి మేరా॥**
**పీవో పీవో ప్యారె మన్ నిషిద్ధి నిషా । నాచే గావో రాధే కృష్ణ మేరా మేరా॥**
**నాచే గావ సద్గురు కృపా మేరా మేరా ॥ తుమ్హారా మేరా ॥**

అబ్బబ్బ ఎంతెంత ఆనందమో కదా! మనపై శ్రీ సద్గురుదేవుల కృప వర్షింప చేస్తున్నారు. వారి ఆశీస్సులతో పునీతమై జగత్తులో జగన్నాథుని తన్మయతతో అణువణువు శ్రీసద్గురుదేవుని పలుకరింపుతో మనమందరమూ తరింతుము గాక!

సర్వదా సర్వధా సద్గురుసేవలో
మీ అమ్మ

# బాబూజీ ఉవాచ

(గత సంచిక తరువాయి) - విజయేశ్వరానంద ప్రసాద్

ఒకసారి రాధ, చంద్ర, యితర స్నేహితురాళ్ళతో కలిసి ఉద్యానవనంలో దాగుడు మూతలాడుతున్నారు. చంద్ర కళ్ళకు గంతలు కట్టారు. ఆమె చుట్టూ చప్పట్లు కొడుతూ ఆమెకు అందకుండా ఆడిస్తున్నారు. ఆమె ఎవరినైనా తాకితే వాళ్ళు దొంగ అవుతారు. అప్పుడు వాళ్ళ కళ్ళకు గంతలు కడతారు. చంద్ర చప్పట్లు వింటూ ఆ వైపు తిరుగుతూ ఎవరినైనా పట్టుకోవాలని ప్రయత్నం చేస్తోంది. అనుకోకుండా (అనుకోకుండా ఏమిటి? కావాలనే, అనుకునే) కృష్ణుడు అటువైపుగా వచ్చాడు. చంద్ర తడుముకుంటూ వెళ్ళి కృష్ణ పరమాత్మను గట్టిగా పట్టేసుకుని "అమ్మ దొంగా! నిన్ను పట్టేసుకున్నాను! ఇప్పుడు నువ్వు దొంగవు" అంది.



ఆయన నిజంగా దొంగే! ఇప్పుడు దొంగ అవటమేమిటి? ఎప్పుడూ దొంగే. అందరి మనస్సులను హరించి ఆనందంలో ఓలలాడించే సర్వ చిత్తచోరుడు. అందుకే ఆయనను తస్కరాణాంపతి అన్నారు. అందరూ ఫక్కున నవ్వేశారు. రాధ కూడా నవ్వుతూ "నువ్వు పట్టుకున్నది నన్ను కాదే! అయినా నీ అదృష్టం పండిందిలే. పట్టుకోవలసిన వారినే పట్టుకున్నావు. ఇక నీ జన్మ ధన్యమవుతుంది" అంది. చంద్ర ఉలిక్కిపడి గంతలు విప్పి చూసింది. "మోసగాడా!" అని కృష్ణుని చెంప మీద కొట్టింది. కృష్ణుడు నవ్వుతూనే ఉన్నాడు. కాని రాధ మాత్రం చంద్ర చెంపలు ఎడాపెడా వాయించి "మూర్ఖురాలా! ఎంత పని చేశావు?" అని, కృష్ణుని పాదాలపై పడి "ప్రభూ! ఈ అవివేకురాలి ధూర్తత్వాన్ని క్షమించు, నీకు తగిలిన ఆ దెబ్బలన్నిటిని నాకు transfer చెయ్యి. లేకపోతే నేను యమునలో పడి చచ్చిపోతాను" అని వేడుకున్నది. కృష్ణయ్య చిరునవ్వులు చిందిస్తూ "రాధా! ఆమె కూడా నా భక్తురాలు కావాలని గదా నీ కోరిక? దానికి యిది foundation నీవు బాధ పడకు. రేపు ఆవిడే పశ్చాత్తాపపడి, నీకంటే ఎక్కువగా నన్ను ప్రేమించి నా భక్తురాలు అవుతుంది" అన్నాడు. చంద్రతో ఏమీ అనలేదు.

ఇక్కడ రాధాకృష్ణులు యిలా మాట్లాడుకుంటూనే ఉన్నారు. చంద్ర చెయ్యి కృష్ణుని చెక్కిలికి ఎప్పుడైతే తగిలిందో, ఆ క్షణమే ఆ దివ్య స్పర్శ ద్వారా ఆమె హృదయంలో కృష్ణయ్య ప్రవేశించి శస్త్రం మొదలుపెట్టాడు. అంతకు ముందు ఆమె హృదయంలో పేరుకుపోయిన ద్వేషం నిరసన భావం పూర్తిగా హరించిపోయి, అనురాగ భావము, ఆరాధనా భావము, పశ్చాత్తాపము ముప్పిరిగొని ఆమె హృదయంలో తుఫాను చెలరేగి, అది శాంతించేసరికి ఆమె మనస్సు కృష్ణయ్యపై స్థిరంగా నిలబడిపోయింది. అలా నిలబడిన మనస్సులో ప్రవేశించి తానూ అక్కడే నిలబడి పోవటం కృష్ణయ్యకు మామూలు. అలా కృష్ణయ్య రూపం నిలుపుకున్న మనస్సుకు సర్వమూ కృష్ణమయంగా కనిపించటం సహజమే. ఎలాగో తన్ను తాను సంబాళించుకుని యింటికి వెళ్ళిపోయింది చంద్ర.

చంద్ర భర్త వెంకన్న వచ్చాడు. ఎంతో చలాకీగా ఉన్నాడు. "చంద్రా! ఇక మనం మన యింటికి వెళ్ళిపోదాంరా. మీ పుట్టింట్లో ఎన్నాళ్ళు ఉంటావు?" అన్నాడు. "ఈ మాట్లాడుతున్నది తన భర్తేనా? ఆయన ఉండేది బృందావనంలో. అక్కడికి వస్తే తన భార్య మిగతా అందరికి మల్లే కృష్ణుని ప్రేమలో పడుతుందనే భయంతో ఇన్నాళ్ళూ నన్ను బృందావనానికి రానీయకుండా పుట్టింట్లోనే ఉంచేశాడు. మరి యివాళ యీ పిలుపేమిటి? ఈయన కన్నయ్య కాదు గదా? ఏమైతేనేమి, బృందావనం వెడితే, కృష్ణయ్య దర్శన భాగ్యం రోజూ లభిస్తుంది గదా!" అని బయల్దేరింది. రెండెడ్ల బండిలో యిద్దరూ వెడుతున్నారు. చంద్రను దగ్గరకు తీసుకుంటూ వెంకన్న "చంద్రా! ఇక మన మధ్య ఎవరూ ఉండటానికి వీల్లేదు" అన్నాడు. ఆ చురుకుతనము, ఆ మృదుస్పర్శ, ఆ ఆప్యాయత చూస్తున్న కొద్దీ యీయన యీయనేనా? లేక 'ఆయనా' అని చంద్రకు అనుమానం వస్తూనే ఉంది.

బండిని దోవలో ఒక మామిడి తోపులో ఆపాడు. ఇద్దరూ దిగారు. ఒక మామిడి చెట్టు క్రిందకు వెళ్ళి కూర్చున్నారు. వెంకన్న ఆమెను దగ్గరకు తీసుకుని బుగ్గపై మృదువుగా చిటికెవేశాడు. ఆ చిటికె ఎవరికి తగిలితే, వాళ్ళ మనస్సులో ఆ చిటికా, దానితోబాటు ఆయన మనోహర రూపమూ శాశ్వతంగా నిలిచి, చిటికెతో బాటే ముద్ర పడిపోతుంది. ఆమెలో ఎన్నెన్నో మధుర భావాలు చెలరేగాయి. తన భర్తేనా? ఇంత మధుర స్పర్శ ఏమిటి, ఈ చురుకుతనమేమిటి? అని తన్మయత్వంతో అనుకుంటున్నది. ఆమె జన్మ సుకృతం పండే టైము

వచ్చింది. కర్మమంతా పటాపంచలై పోయింది. వెంకన్న ఆమె ఒడిలో నెమ్మదిగా వాలాడు. ఆ స్పర్శలో యింద్రియాతీతమైన ప్రేమ, కళంకరహితమైన ప్రేమ, క్షీరసాగరం వలె తనను ముంచెత్తుతున్న ప్రేమలో దివ్యానుభూతిలో మునిగిపోయింది.

కొంత సేపటికి చంద్ర తేరుకొని కనులు తెరచి చూసేసరికి తన ఒడిలో కృష్ణయ్య! "ప్రభూ! నేనెంత దుర్మార్గురాలిని! ఇన్నాళ్ళూ నిన్ను గుర్తించలేక పోయాను. ఏమి నీ కమనీయ రూపము! అద్భుతమైన యీ ఆత్మ సౌందర్యాన్ని చూడగలిగిన కన్నులే కన్నులు. సర్వ జీవకోటిని నీలో చేర్చుకునే కరుణానిధివి. నాపై యీనాటికి కనికరించావా! ఈ అనుభూతి ఇలాగే శాశ్వతంగా నిలిచిపోయేటట్లు అనుగ్రహించు ప్రభూ! నీలో నన్ను లీనం చేసుకో ప్రభూ!" అని వేడుకుంది. "తథాస్తు" అని వరం ప్రసాదించాడు కృష్ణయ్య.

తెల్లవారు ఝాము అయిపోయింది "సూర్యోదయం కావస్తోంది" అంటూ కన్నయ్య లేవబోయాడు. "నేను నిన్ను విడువలేను. కనుక సూర్యోదయం కాకూడద"ని తన అనురాగ బంధంలో భగవానుని బంధించింది చంద్ర. అది నీచ బంధము కాదు. సర్వ బంధ రహితం చేసే దివ్య అనుబంధము.

సూర్యోదయం నిలిచిపోతే లోకాలు గగ్గోలు పడతాయి. అందుకని రాధ, అక్రూరుడు, నారదుడు వారి వద్దకు వెళ్ళారు. రాధ చంద్రతో "నీవు స్వామిని అలా బంధించి, సూర్యోదయమే నిలిపి వేస్తే ఎలా? ఆ దయామయుడు భక్తి త్రాళ్ళతో అలాగే ఎప్పుడూ బంధింపబడిపోతూ ఉంటాడు.

అందుకని మనం స్వార్థంతో ఆయన్ను మన వద్దనే బంధిస్తే, లోకాలన్నీ ఏమైపోతాయి? ఆయన అందరివాడూ అయిన జగన్నాథుడు కదా! మనస్సులో మాత్రం ఆయన్ను శాశ్వతంగా బంధించుకుని, స్వామిని నీవు విడిస్తే గాని సూర్యోదయం కాదు"అని కృష్ణతత్త్వం వీనుల విందుగా చెప్పింది. చంద్ర అలాగే చేసింది.

చంద్ర వలెనే మనమందరము ఆ జగన్నాథుని మన హృదయ మందిరంలో శాశ్వతంగా బంధించుకుని భవబంధ విముక్తులమగుదుము గాక!!

# మాతాజీ అభిభాషణ

(గత సంచిక తరువాయి) -జపమాల ప్రసాద

## 11. GOD అంటే
## (భగవంతుడు అంటే?)



(జులై 7వతేదీ - 2003 ఆవెనెల్ - న్యూజెర్సీ, అమెరికాలో ప్రవాస భారతీయులకు శ్రీమాతాజీవారు అందించిన బోధామృతం)

"మీరందరూ మీ తలిదండ్రులని విడిచి యీ దూరదేశానికి వచ్చారు. వారికి మీ పైన బెంగ, మీకు వారిపైన బెంగ! ఇది సహజం. ఎంతో ప్రేమానురాగాలతో మిమ్మల్ని పెంచి పెద్దచేశారు మీ తలిదండ్రులు. ఈనాడు మీరు పెద్దవాళ్లయి మీమీ సంసారాలని చక్కబెట్టుకుంటున్నా, వారి దృష్టిలో మాత్రం మీరింకా వాళ్ళ చిన్నారి పిల్లలే! మిమ్మల్ని విడువలేక పోతున్నారు.

కొంతమంది కోడళ్ళని తప్పుబడతారు; కొందరు కొడుకులు తలిదండ్రులని తప్పుబడతారు. ఈ విధంగా మానవ ప్రేమలలో ఈర్ష్య, అసూయ, స్వార్థము, ఓర్వలేనితనము వంటి కించిత్ కించిత్ భావాలు చోటు చేసుకుంటున్నాయి. ఇవే యింటిలోని వారి మధ్య భేధాభిప్రాయాలు పుట్టించి, పరస్పర విరోధాలకి దారి తీసి, తీవ్రమైన అశాంతికి గురిచేస్తాయి. మరొక విధంగా చెప్పాలంటే, ఆ కుటుంబ సభ్యుల ప్రేమలలో మార్పు చోటు చేసుకుంటుంది. ఈ మారిపోయే లౌకిక ప్రేమల మధ్య మారనటువంటి ప్రేమ ఒకటుంది. అదే భగవంతుడి ప్రేమ. ఈ ప్రపంచంలో అన్నిటికీ ఊతంగా వుండి అన్నిటినీ నడిపిస్తున్న ఒక ఫోర్సు లేక చైతన్యం 'భగవంతుడు'. ఇదే పరమ సత్యము. అది శాశ్వతమైనది, మార్పు లేనటువంటిది. అదే అఖండశక్తి లేక ఆత్మ లేక పరమాత్మ.

ఇంగ్లీషులో భగవంతుడిని God (గాడ్) అంటారు. 'G' అంటే Generator; 'O' అంటే Operator 'D' అంటే Destroyer అని అనుకోవచ్చు. అంటే,

ఆ భగవంతుడే సృష్టికర్త అయిన బ్రహ్మ (Generator or Creator), స్థితికర్త అయిన విష్ణువు (Operator), మరియు లయకర్త అయిన శివుడు (Destroyer or Annihilator) అన్నమాట. గురుదేవుడు అటువంటి త్రిమూర్తి స్వరూపుడు. అంతేకాదు, ఆయన త్రిమూర్త్యాతీత స్వరూపవైన సాక్షాత్తు పరబ్రహ్మస్వరూపుడు, చరమ సత్యము కూడాను. ఇదే "సత్య గురువు" అనే పదానికి నిర్వచనం. తను పొందినటువంటి అపరోక్షానుభూతిని తననాశ్రయించిన శిష్యకోటికి కూడా పంచియిచ్చి, వారిని సుఖ శాంతులతో జీవించే మార్గంలో నడిపించడమే కాకుండా, యీ జనన మరణ దుఃఖవలయం నుండి కూడా రక్షించి, వారిని తరింపచేయగల సమర్థులు సత్యగురుదేవులు.

కానీ, అజ్ఞానంలో కూరుకొనిపోయిన మానవుడు, తన చర్మ చక్షువులకి కనపించనటువంటి భగవంతుడిని నమ్మడం అనవసరమని భావిస్తాడు. పోనీ, అలాగని, ఆ భగవంతుడే ఒక మానవాకృతిని దాల్చి యీ భూమి మీదకి వచ్చినా, నమ్ముతాడా అంటే, నమ్మడు. "ఆ! ఇతను దేవుడేమిటి? నాలాంటి మామూలు మనిషే!" అని అవతలకి తోసేస్తాడు.

శ్రీకృష్ణ భగవానుడు భగవద్గీతలో

**"యదా యదా హి ధర్మస్య**
**గ్లానిర్భవతి భారత।**
**అభ్యుత్థానమధర్మస్య**
**తదాత్మానమ్ సృజామ్యహమ్"** అని చెప్పారు.అంతే కాకుండా,
**"పరిత్రాణాయ సాధూనామ్**
**వినాశాయ చ దుష్కృతాం**
**ధర్మ సంస్థాప నార్థాయ**
**సంభవామి యుగేయుగే"** అని శెలవిచ్చి ఉన్నారు. అంటే, ఎప్పుడయితే ధర్మానికి గ్లాని (కష్టం) సంభవించి, అధర్మం ప్రబలుతుందో, అప్పుడు తనమాయను తానే స్వీకరించి, ఒక అవతారం దాల్చి వస్తానని చెప్పి, ఆ తరువాతి శ్లోకంలో, మళ్ళీ మరొక్కసారి తమ అవతార రహస్యాన్ని నొక్కి చెప్పారు. ఏమని అంటే, 'సాధువులను సజ్జనులను పరిరక్షించడానికి, దుష్కృత్యములు చేసేవారిని శిక్షించి ధర్మాన్ని స్థాపించడానికి తాను ప్రతి

యుగములోనూ అవతరిస్తూ వుంటానని గీతాచార్యుడు చెప్పారు. 'యుగే యుగే' అంటే ప్రతి యుగమునందేనని అర్థంకాదు; పదేపదే అనికూడా అర్థం. "ధర్మాన్ని సంరక్షించడానికి పదేపదే అవతారం దాల్చి వస్తాను" అని కూడా అర్ధం చేసుకోవాలి. ఆ విధంగా ఆయన ఒక సద్గురు రూపంలో, ఆధ్యాత్మిక విద్యను నేర్పే సత్య గురురూపంలో కూడా అవతరించవచ్చు. కానీ మాయకు వశుడై, అజ్ఞానియైన మానవుడు యీ సత్యాన్ని గ్రహించక, ఆయన శరణు కోరడు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు, సద్గురుమూర్తి తమ అవతార ప్రయోజనమును పూర్తి చేసుకొని, భౌతిక శరీరమును విడిచి వేసి, తమ స్వస్వరూపములో లీనమయిపోయిన పిదప, అప్పుడీ మూర్ఖమానవులు కళ్ళుతెరచుకొని, గురుమూర్తి యొక్క గొప్పతనాన్ని గుర్తించడం మొదలుపెడతారు. శ్రీ షిరిడీ సాయిబాబా విషయంలో ఇలాగే జరిగింది కదా! ఆ మహానుభావుడు అవతారం దాల్చివచ్చి యీ లోకంలో వున్నన్నాళ్ళూ ఎంతమంది ఆయన యొక్క దివ్యత్వాన్ని గుర్తించారు? ఇప్పుడు ఆయన ఈ భూలోకం నుండి అదృశ్యులైపోయిన తరువాత గుడులూ, గోపురాలు కట్టించడం, వేలాది భక్తులు తరలి రావడం పువ్వుల, పళ్ళూ అర్పించటం జరుగుతున్నాయి!

భగవంతునియందు విశ్వాసమే మనని సద్గురునాధుని చెంతకు తీసుకువెళ్తుంది. తనయొక్క అపారమైన కరుణతో, భగవంతుడు గురుమూర్తితో మనయొక్క అనుసంధానాన్ని ప్లాను (Plan) చేస్తాడు. ఎప్పుడయితే మనకి ఆ భగవత్కృపవల్ల, సత్యగురుదేవుడు లభ్యమవుతారో, అప్పుడు మనం ఆ గురుమూర్తి యందు అఖండమైన, అచంచలమైన విశ్వాసాన్ని, నమ్మకాన్ని కలిగివుండి, వారియొక్క ఆజ్ఞను తు.చ. తప్పకుండా పాలించాలి.

అయితే, ఫలానా గురువు సత్యగురువనే విషయం ఎలా తెలుస్తుంది? సత్యగురుదేవుని సన్నిధిలో మనకొక విధమైన అలౌకికమైన హాయి, శాంతి, ఆనందము అనుభూతమవుతాయి. అదే వారి యొక్క సత్యత్వానికి నిదర్శనం. ఎప్పుడయితే మనం గురుదేవుడికి సర్వ సమర్పణ గావించుకుంటామో, ఆయన తన రక్షణ కవచమనే రెక్కల కిందకి మనని తీసుకుని, సత్యమార్గంలో నడిపిస్తారు.

ఆ తరువాత, గురుదేవుడు తననాశ్రయించిన శిష్యునికి మంత్రోపదేశమును ప్రసాదించి, ఏవిధంగా ఆ మంత్రాన్ని అనుష్ఠించాలో, ఏవిధంగా ధ్యానం చేయాలో నేర్పించి, ఒక నిర్దిష్టమైన మార్గమును సూచిస్తారు. గురుదేవుడు చూపించిన మార్గంలో ప్రయాణిస్తూ వారు చెప్పిన పథ్యాన్ని పాటిస్తూ, సాధన కొనసాగించే శిష్యుడు తాను పొందవలసిన ఉన్నత స్థితిని పొందగలుగుతాడు.

ఒక చక్కటి సుక్షేత్రంలో మనం ఒక బీజం నాటితే, మనం చేయవలసిందల్లా కేవలం దానికి నీరు అందిస్తూ, కలుపు మొక్కలని దరికి రానీయకుండా ఏరిపారవేస్తూ, మిగతా జంతువుల బారినుండి దానికి రక్షణ కల్పిస్తూ, జాగ్రత్తగా చూసుకుంటూ వుంటే చాలు. అది పువ్వులని పళ్ళని ఎప్పుడిస్తుందా అని మనం ఆదుర్దా పడనవసరం లేదు. ఆ పనిని భగవంతుడే చూసుకుంటాడు. సరైన కాలంలో, సరైన ఫలితాన్ని ఆయనే ఇస్తాడు. అదే విధంగా గురుదేవుల ఆజ్ఞానుసారం నడుచుకుంటూ, మన ధర్మాన్ని మనం ఆచరిస్తే చాలు. ఫలితాలని గురించి మనం చింతించనక్కరలేదు. ఆ విధంగా మనం ఆత్మజ్ఞానాన్ని, స్వస్వరూప జ్ఞానాన్ని పొందవచ్చు.

ఏదయినా సరే నీ నుండే మొదలవుతోంది. 'నువ్వు' వుంటేనే, ఈ ప్రపంచం వుంది. మనం నిద్రలేవగానే ముందుగా వేరే ఎవ్వరినీ చూడం. ముందు మనని మనం చూసుకుంటాము. ఆ తరువాతే మిగతా వారి గురించి, మన చుట్టూ వున్న పరిసరాల గురించీ ఆలోచిస్తాము. 'ఆత్మ' లేక 'నేను' అంటే యీ భౌతిక శరీరం యంత్రం కాదు. అయితే ఆత్మ అంటే నీ శరీరంలోనే ఉండి నిన్ను నడిపిస్తున్న చైతన్యం. అదే నీ నిజమైన 'నేను'; అంతేగానీ, పైకి కనిపిస్తున్న మేను కాదు.

తాను సర్వజ్ఞుడూ, సర్వశక్తిమంతుడూ, సర్వేశ్వరుడూ, సర్వాంతర్యామీ కనుక, గురుదేవుడు దేవుని యొక్క సర్వవ్యాపకత్వాన్ని, సర్వశక్తిస్వరూపాన్ని మనం గుర్తించేటట్టు చేయగలుగుతారు. వాస్తవానికి, మానవుడు కూడా అంతే. మానవునిలో వున్న 'మంచియే' భగవంతుడు. అటువంటి భగవత్తత్వము ప్రతి మనిషి లోనూ వున్నది.

-సశేషం

## సన్నిధిలో సంభాషణ

(గత సంచిక తరువాయి) - పరాశర ప్రసాద్

**29-5-1985**

ఈ రోజు ఉదయం సిరిపురం లక్ష్మిగారి భర్త దైవ సాయుజ్యం పొందిన సందర్భంగా పాదపూజకు అన్ని ఏర్పాట్లు జరిగాయి. పూజ ఎప్పుడు జరిగేది తెలియలేదు. ఇంతలో డా॥స్వర్ణ సంకీర్తన ప్రారంభించారు. ఇంక కొద్ది సేపట్లో పూజ ప్రారంభం అవుతుంది కదా అనుకొని అందరమూ కూర్చున్నాము. సుమారు 2గంటలసేపు సంకీర్తన జరిగింది. పూజ ప్రారంభం కాలేదు. డా॥ ప్రసాదరావుగారుగారు అంతవరకు వేచి ఉండి అర్జంటుపని ఉండటం వలన యూనివర్సిటీకి వెళ్ళారు.

ఇంతలో శ్రీబాబు బయటకు వచ్చి ఆసీనులై పూజ ఎవరు చేసుకుంటున్నారో రండి అని పిలిచి 10నిమిషాలలో పూజా కార్యక్రమాన్ని ముగించి లోపలికి వెళ్ళిపోయారు. పూజా కార్యక్రమం ముగిసిన వెంటనే భక్తులందరికీ భోజనాలు ఏర్పాటు చేశారు. ఇది ఇలా ఉండగా డా॥ ప్రసాద రావుగారు యూనివర్సిటీ నుంచి వచ్చి. విషయం తెలిసికొని నిశ్చేష్టులై నిలబడి ఉన్నారు. భక్తులు ఆవేదన చెందితే భగవంతుడు ఊరుకుంటాడా? శ్రీబాబు డా॥ప్రసాదరావుగారిని లోపలికి రమ్మనమని పిలిచారు. ఆయనతోపాటు నేను, డా॥రాజు వెళ్ళాము.

ప్రసాదరావుగారు శ్రీబాబుకి పూలమాల వేసుకున్నారు. శ్రీబాబు మాట్లాడుతూ ఈ పూలహారం ఎక్కడిదండీ? ఇలా ఉంది. దీని విలువ రెండు రూపాయలు ఉంటుందేమో! అయినా ఈ హారం ఎందుకండీ నాకు! బాధపడకండి! మీ హృదయబాబు వీటిని ఎన్నడూ ప్రేమించడు. మీరు వేసిన పూలహారం పెద్దదా? చిన్నదా? అది ఏ పుష్పాలతో తయారు చేసినది? దాని విలువ ఎంత? అని ఆలోచించడు. మీ మనోపుష్పాన్ని సమర్పించండి చాలు. మీ బాబు కోరుకొనేది అదే అన్నారు.

పాదపూజ మిస్ అయ్యానని బాధగా ఉంది అన్నారు ప్రసాద రావుగారు.

శ్రీబాబు మాట్లాడుతూ అయ్యో! పాపం ! పాదపూజకు రాలేదా?

నిరంతరం మీ మనస్సులో పాదపూజ జరగటం లేదా? సదా మీ సహస్రారంలో గురుపాదాన్ని చిత్రించుకుంటే కావలసినదేముంది? పాండవులు అలా చేశారు. అందువలననే వారు రక్షింపబడ్డారు. ద్రౌపది సహస్రారంలో మహావాక్యాలు అనే రత్నాలు పొదగబడిన ఆధ్యాత్మిక పీఠముపైన ఆ దివ్యచరణార విందాలను నిలుపుకొని ధ్యానించేది, అందువలననే కామాంధులైన కౌరవులు మానభంగం చేయలేకపోయారు.

పూజ అనేది క్రియ. అది మీలో విశ్వాసాన్ని పెంపొందింపజేస్తుంది. అది కేవలం బాహ్యమైనది. దీనికన్నా పై స్టేజ్ ఒకటి ఉంది. అదే మానసిక పూజ. మీ మనస్సులో ఆ దివ్యచరణావిందాలను నిలుపుకుని ధ్యానించాలి. మనస్సు ఎట్టి పరిస్థితులలోనూ చలించకూడదు. ఆత్మ మూడు అవస్థలలోనూ మారదు అంటే చాలదు. అది అనుభవపూర్వకంగా తెలిసికోవాలి. ఏం డాక్టర్? అన్నారు.

శ్రీబాబు ఇంకా మాట్లాడుతూ మానవుడు ఉన్నదానిని గుర్తించలేక పోతున్నాడు. లేనిదాన్ని ఉన్నదని భ్రమిస్తున్నాడు. ఏం విచిత్రం అండీ? మీరు రైలులో ప్రయాణం చేస్తున్నారు. కదిలే రైలు కదలటం లేదు అనుకుంటున్నారు. చుట్టూ ఉన్న కదలని చెట్లు కదులుతున్నాయని భ్రమిస్తున్నారు. కంసాలి దిమ్మిస పైన తన చాకచక్యంతో ఎన్నో నగలు తయారుచేస్తారు. నగలు మారతాయి గాని దిమిసా మారేది కాదు. మీ కంటిని వేలుతో నొక్కిపట్టి చూస్తే ఉన్న వస్తువు రెండుగా కనబడుతుంది. అదే మాయ. మాయ మనిషిని చూసి వెక్కిరిస్తుంది. "ఓరీ! సన్నాసీ! నన్ను జయించలేనివాడివి ఆత్మని ఏం సందర్శిస్తావు? కామక్రోధాధి గుణాలకి దాసుడైన వాడివి నన్ను ఎలా జయించ గలుగుతావు? గుణరహితుడు నన్ను జయించగలడు కాని, గుణ సహితుడైన నువ్వు నన్ను ఎలా దాటగలుగుతావు? సోమరితనాన్ని వదిలిపెట్ట లేనివాడివి నన్ను ఎలా జయించగలుగుతావు?'' అని ప్రశ్నిస్తుంది.

గురుపాదాలను పట్టుకొని తను మనో ధనాలను అర్పించి ప్రతిజ్ఞ చేసి గురులక్ష్యార్థాన్ని నిర్లక్ష్యం చేసినవాడు కాని, గురువాజ్ఞా పాలన చేయనివాడు కాని ఆత్మను ఎలా సందర్శించ గలుగుతాడు? దుర్యోధనుడు అర్జునుడు ఇరువురూ ద్రోణాచార్యుని శిష్యులే. వారిద్దరికీ ఒకనాడు ధనుర్విద్యా పరీక్ష నిర్వహించాడు. దుర్యోధనుడికి రెబ్బలు, ఆకులు కవబడ్డాయి. ద్రోణాచార్యుడు

దుర్యోధనుని వెరీగుడ్ కూర్చో అన్నాడు. నేనే గొప్పవాడిని అనుకున్నాడు దుర్యోధనుడు. అర్జునుడికి మాత్రం గురుదేవుడు ఏది చెబితే అదే కనబడింది. అర్జునుడిని కూర్చో అన్నాడు. ఇరువురిలో ఎవరు గొప్ప?

ఒక సంగీత విద్వాంసుడు ఫ్లూట్ కచేరీ ఇస్తాడు. ప్రేక్షకులందరిని ఆనందంలో ముంచివేస్తాడు. అక్కడ గొప్పదనం ఫ్లూట్‌దా? లేక దానిని వాయించినవాడిదా? ఫ్లూట్ లేకపోతే ఆ ప్రేక్షకులకి ఆ ఆనందాన్ని ఆ సంగీత విద్వాంసుడు ఇవ్వగలుగుతాడా? పోనీ సంగీత విద్వాంసుడు లేకుండా ఆ ఫ్లూట్ ఆనందాన్ని ఇవ్వగలుగుతుందా? ఈ రెంటికీ శక్తినిచ్చినది ఒకటి ఉంది. అదే ప్రజ్ఞానం బ్రహ్మ.

ఒక డాక్టరు ఉన్నాడు. రోగికి వైద్యం చేస్తాడు. డాక్టరు గొప్పవాడా? లేక గొప్పతనం మందుదా? ఒక కవి ఒక రచన చేస్తాడు. అక్కడ అక్షరాలు గొప్పవా? దానిలో ఉన్న భావం గొప్పదా? చెప్పండి ప్రసాదరావుగారూ! మీరు పండితులు అన్నారు.

-సశేషం

కట్టెలమ్ముకొని జీవించే పేదవాడొకడు అలవాటుగా ఒకనాడు అడవికి పోతుండగా, దారిలో అతనికి ఒక సాధుపురుషుడెదురైనాడు. 'ఇంకా కొంచెం ముందుకెళ్ళు" అని వానితో పలికి తనదారిన తాను సాగిపోయాడు. సంపాదనలో పైసా కూడా చేతిలో మిగలని బీదవాడు 'ఎందుకు చెప్పాడో మహాత్ముడు' అనుకుంటూ తన మామూలు చోటుకంటె ఇంకొంచెం ముందుకి వెళ్ళాడు. అక్కడ అతనికి గంధపు చెట్లు కనిపించాయి. పరమానందంగా వాటిని కొట్టి తెచ్చి అమ్ముకుంటే డబ్బు మరింతగా వచ్చింది. స్వామి మాటలే తల్చుకుంటూ అతడు రోజురోజూ ఇంకొంచెం ముదుకి వెళ్ళగా క్రమంగా వెండి, బంగారు, వజ్రాలు లభించి వాటితో అతడు కోటీశ్వరుడైనాడు.

సద్గురు నాధుడు సూచించిన మార్గంలో ముంగుకు సాగిన సాధకునికి తప్పక లక్ష్యార్థ సిద్ధి అనే లబ్ధి దొరుకుతుంది.

- శ్రీరామకృష్ణ పరమహంస

## శ్రీకాళీగార్డెన్స్‌లో విశేషపూజా కార్యక్రమములు

**జూలై 2011**

11 సోమ తొలిఏకాదశి, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

15 శుక్ర ఆషాఢ (వ్యాస పూర్ణిమ) శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగం, భక్త సమారాధన. (చాతుర్మాస్య దీక్ష ప్రారంభం)

17 ఆది దక్షిణాయన ప్రారంభము

25 సోమ శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

29 శుక్ర మాసశివరాత్రి.

**ఆగష్టు 2011**

12 శుక్ర వరలక్ష్మి వ్రతం.

13 శని రాఖీపూర్ణిమ, రక్షా బంధనం, శ్రీ సద్గురుపాదపూజ

**21 ఆది నుండి మంగళ వరకు శ్రీ కృష్ణాష్టమి పూజలు**

21 ఆది ఉదయం 10 గం.లకు కలశస్థాపన, శ్రీ రాధాకృష్ణ అర్చన, భక్త సమారాధన. రాత్రి 8గం.లకు శ్రీసద్గురు పాద పూజ.

22 సోమ ఉదయం 5-30ని॥ శ్రీసద్గురుపాదపూజ,11 గం.లకు శ్రీ రాధాకృష్ణ సామూహిక పూజలు, భక్త సమారాధన.

23 మంగళ ఉదయం 11 గం.లకు శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగం, భక్త సమారాధన. రాత్రి 8 గం.లకు ఉట్టి కొట్టుట

24 బుధ శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

27 శని శనిత్రయోదశి , మాస శివరాత్రి

# శ్రీగురు దక్షిణ

- సుశీలా ప్రసాద

చిన్న ఊరు.... ప్రక్కనే కొండ. ...కొండ దిగువన చిన్న గుడి, గుడిలో దేవుడు వేణుగోపాలుడు. నల్లగా ఉన్నా, అందంగా ఉంటాడు. నెత్తిమీద నెమలి పింఛం, ముక్కు కొసన ముత్యం, చేత పట్టుకున్న మురళి పెదిమల పైన నాట్యమాడుతూ, ఇలాగ సన్నిధిలో ఉండే సౌభాగ్యాన్ని మీరూ పొందవచ్చు రా రండంటూ అందరినీ పిలుస్తున్నట్లు ఉంది. వినబడేవాళ్లకి, అలాగందని అనిపిస్తూ ఉంటుంది. ఆయన్ను ఆనుకొని మైమరచిపోతున్నట్లు ఉండే గోమాత కూడా అదే మాట అంటున్నట్లు ఉంటుంది. మరి ఆ గుడి ఎవరు కట్టించారో, మడి మాన్యాలేమైనా ఉన్నాయో లేదో, ఎవరికీ గుర్తులేదు. అంటే ఆలయ ధర్మకర్తలు కాలగర్భంలో కలిసిపోయి ఉండవచ్చు అందువల్లనేమో!

నాగరికత నీడ పడని, నమ్మకాల పట్టు సడలని ఆ ఊళ్ళో జనం ఎక్కువ మంది కష్టజీవులే. ఏడాది పొడుగునా శ్రమపడుతూ, పంట ఇంటికి చేరేసరికి కొండెక్కినంత సంతోషపడుతూ ఉంటారు. ఇలా ఉండగా...

ఒకనాడు పొరుగూరు నుంచి, ఒక వైదిక బ్రాహ్మణుడు తన భార్యతో సహా ఆ ఊరికి వచ్చాడు. ఇంతదాకా తానున్న ఊరిలో జరుగుబాటు లేక, దీన దశలో పొట్టచేత పట్టుకుని ఆ ఊరికి వచ్చానని ఆ ఊరి ప్రజలకు చెప్పుకున్నాడు. ఆయన పొట్ట నిండా మంత్రాలు ఉన్నాయని, తమకే పూజలు, పునస్కారాలు, పెళ్ళిళ్ళు, పేరంటాలు కావలసివచ్చినా, ఆయన విద్య ఉపకరించగలదని, ఆయన పొట్టకూటికి అది కలిసి వస్తుందని గ్రహించిన గ్రామస్థులు ఆయన్ను సహృదయంతో ఆదరించారు.

ఆయన పేరు రామశర్మ. ఊళ్ళో స్థిరపడ్డాక, కొన్ని రోజులకు రామశర్మ గుడివైపు వెళ్ళాడు. చారడేసి కళ్ళు పెట్టుకుని వేణుగోపాలుడు ఆయన వంక చూశాడు. పెదవి పైనున్న మురళి వెనకనుంచి చిరునవ్వులు చిందించాడు. స్వామి కళ్ళల్లో 'నువ్వు నా వాడవు' అన్నట్లు ప్రేమ గోచరించింది రామశర్మకి. వెంటనే ఊళ్ళోకి వెళ్ళి, పెద్దలతో "అయ్యా! నేను గుళ్ళో స్వామికి పూజ కూడా చేసుకుంటాను" అన్నాడు.

మూడోనాడు గుడికానుకుని ఉన్న స్థలంలో ఒక పూరిల్లు కట్టించి ఇచ్చారు ఊరివాళ్ళు. ఇప్పుడు రామశర్మ అవసరమైనప్పుడు ఊళ్ళోకి వెళ్ళి వస్తుంటాడు. నిత్యమూ గుళ్ళో స్వామిని కొలుచుకుంటూ ఉంటాడు. పనికి

వంగుతూ లేస్తూ కృష్ణా, రామా అనుకునే ప్రజలు ఇప్పుడు తీరికైనప్పుడల్లా గుడికి రాకపోకలు సాగించారు. స్వామికి దండం పెట్టి, అర్చక స్వామికి దక్షిణ నాలుగు డబ్బులు వేసి, ఆయన దీవెనలనందుకుని వెడుతుండటం మొదలు పెట్టారు.

పండుగకీ, పబ్బానికీ గుడి దగ్గర నలుగురూ కనిపిస్తున్నారు. చుట్టు ప్రక్కల ఊళ్ళవాళ్ళెవరైనా ప్రక్కనున్న కాలిబాట మీదుగా వెళ్ళేటప్పుడు గుడి ముందు ఆగి, చేతులు జోడించి వెళ్ళటం పరిపాటి అయింది. ఇన్నాళ్ళూ అజ్ఞాతంలో ఉంటున్న స్వామికి, రామశర్మ పుణ్యమా! అని ఓ గుర్తింపు కలిగింది. ఊళ్ళోవాళ్ళకి శుభకార్యాలు చేయించినందుకు వచ్చే పైకంతో పాటు, పల్లె ప్రజలు తమకు పండిన పంటలో కాయో కసరో రామశర్మకి అభిమానంగా యిస్తుండటంతో ఆ దంపతులకి దిగుల్లేకుండా జీవనం గడిచిపోతోంది.

"ఏమయ్యా! నాకు పిల్లల్లేరా! ఇదిగో! ఈ గుడిలో దొరికాడు వీడు! వీడు చాలడూ! పొద్దస్తమానం వీడికి చేసి, చేసి నాకు ఎంత సమయం చాలటం లేదే! ఇక చీకూ చింత, ఆలోచనలకి సమయం, అవకాశం ఎక్కడ? మీ పిల్లలు మిమ్మల్ని ఏదో కారణంగా విసిగిస్తారేమో కాని, నా బిడ్డ నన్నెప్పుడూ విసిగించడు, కష్టపెట్టడు. నేనింత గారాబంగా చూసుకుంటుంటే నాకిది లేదు, అది లేదని మారాం కూడా చేయడు మా బంగారు కొండ. నేను వీడితో పొందే ఆనందం మీకు కావాలన్నా దొరుకుతుందా?" అని చెప్పుకుని మురిసిపోతున్న రామశర్మని చూస్తూ, "దేవుణ్ణి బిడ్డలాగ చూసుకుని ఆనందపడిపోతున్న ఆయన పుట్టుక ఎంత గొప్పదో కదా!" అని అనుకుంటారు ఆయన్ను అభిమానించే జనం.

ఎక్కడ పుట్టాడో తెలియదు, నా అన్నవాళ్ళు లేని, ఎవరికీ చెందని 'శివుడు'. ఇల్లూ, వాకిలీ, తల్లీదండ్రీ, ఊరు పేరు లేని, దుమ్ముకొట్టుకొని ఉన్న ఆ అనాధను ఎవరో శివుడితో పోలుస్తూ 'ఒరే శివుడూ!' అని పిలిచారు. అదే వాడి పేరైంది. కానైతే, ఆ శివుడేమో సుగుణాల రాసి, వీడేమో దుర్గుణాల పుట్ట. చిన్నతనం నుంచీ అల్లరి చిల్లరగా తిరుగుతూ, చేవాటుతనానికి అలవాటుపడి పొట్టపోసుకుంటూ, లోకం దృష్టిలో దొంగగా ముద్రపడినవాడు. ఒకసారి ఎవరో అడ్డం వస్తే కత్తిదూసేసరికి, చంపకపోయినా హంతకుడనే పేరు కూడా సంపాదించుకున్నాడు. కొన్నాళ్ళు చెరసాలవాసం, మరికొన్నాళ్ళు నీతి, నిజాయితీ లేని లోకవాసం.

-సశేషం

# గురు కృపాహి కేవలమ్

-రమణ ప్రసాద్

మన మనుగడకి ఆధారం గురుకృపయే. అది మనకి తెలిసినా, తెలియక పోయినా గురుదేవులే మన వద్దకు వచ్చి, లాలించి, బుజ్జగించి మనలను అక్కున చేర్చుకున్నారు. గురుదేవులతో గడిపిన మధుర క్షణాలు గుర్తుకు తెచ్చుకుంటే వారిని మనం సరిగా గుర్తించలేకపోయామా అనిపిస్తోంది. కాని మహాత్ములు మన అవగుణాలను లెక్కించరు. అహర్నిశలూ మన శ్రేయస్సునే వారు కోరతారు. మనలను ఆపదలనుండి రక్షిస్తారు. భగవంతుని చేరే మార్గాన్ని చూపుతారు.

నా చిన్నతనంలో.......................

"లేవాలి! లేవాలి! బాబు వచ్చారు మీరు వెళ్ళి పూలు కోసుకు రావాలి" అని మా తాతయ్యగారు నన్ను, సుబ్బారావును (వడాలిపిన్నిగారి అబ్బాయి) ప్రొద్దుటే లేపారు. "త్వరగా పూలు కోసుకు రండి. మనకు ఈ రోజు ఎన్నో 'ఎవన్నాలు' (ప్రసాదాలు) అన్నారు.

మాకు ఒకటే సంతోషం. బాబు వచ్చారు అని. బాబు సన్నిధిలో ఒక అనిర్వచనీయమైన ఆనందం. మా అమ్మ రెండు పూల సజ్జలు యిచ్చింది. అది చిన్న ఊరు కావటంతో అక్కడ అక్కడ ఉన్న పూల చెట్ల నుండి పువ్వులు కోసుకు రావాలి.

మేము ఇంటి నుండి బయట పడ్డాము. విఘ్నేశ్వరుడి గుడి వద్ద గన్నేరు చెట్లు ఉన్నాయి. గన్నేరు పూలు పూజకు పనికి వస్తాయా రావా అని అనుమానం వేసింది. కొన్ని పువ్వులు కోశాం. ఆ తరువాత మందారాలు కోశాం. ఆ ఊరిలో ఒక జమిందారుగారి ఇల్లు ఉంది. భార్య, భర్త మాత్రమే ఇంట్లో ఉంటారు. వారికి పూల తోట ఉంది. ఆ తోటలో మాలతి, విరజాజి, నైట్‌క్వీన్ చెట్లు ఉన్నాయి. తోటలోకి వెళ్ళాలంటే వాళ్ళు గేటు తీయాలి. మేము తలుపుకొడితే ఆయన గేటు తీశారు. మేము లోపలికి ప్రవేశించాము. మల్లెలు మాలతులు నైట్ క్వీన్‌లు కోశాము. అక్కడ రంగు రంగుల క్రోటన్ పువ్వులు కనిపించాయి.

అవి కూడా కోశాం.

ఇంతలో పంట కాలువలో నీలిరంగులో గుర్రపు డెక్కల పువ్వులు కనిపించాయి. అవి కూడా తీసుకుని ఇంటికి వచ్చాము. మా అమ్మ ఇవి పూజకు పనికిరావు అని చెప్పింది. క్రోటన్ పువ్వులు కూడా పనికిరావని వాటిని తీసివేసింది. కాని మేము పనికిరావనుకున్న గన్నేరు పూలు పూజకు పనికివస్తాయని చెపింది. మేము తెచ్చిన పూలను ఏరి వాటిని శుభ్రపరిచి, పూజకు సిద్ధం చేసింది.

ఆ రోజుల్లో చాలామంది తమ సమస్యల పరిష్కారానికి శ్రీబాబు వద్దకు వచ్చేవారు. బాబు వారి భూత భవిష్యద్వర్తమానాలను చెబుతూ, వారి సమస్యలకు పరిష్కారం తెలిపేవారు. ఏ మధ్యాహ్నానికో నీళ్ళు తోడమనేవారు. ఆ తరువాత స్నానంచేసి వచ్చి వారికి కేటాయించిన పూజ గదిలోకి వచ్చేవారు.

అక్కడ పులి చర్మంతో చేసిన పెట్టె నుండి శ్రీహనుమాన్, శ్రీకాళీమాత మూర్తులను పెట్టి, ఆ మూర్తులను పువ్వులతో స్వయంగా అలంకరించేవారు. ఆ తరువాత పూజ చేసేవారు. అక్కడ పెట్టిన పదార్థాలను అమ్మకు వినేదన చేసి, హారతి ఇచ్చేవారు. హారతి అందరమూ అద్దుకునేవాళ్ళం. ఆ తరువాత నివేదన తీసుకునేవారు. ఎన్ని వంటకాలు చేసినా కొద్దిగా పెరుగు అన్నం మాత్రమే తీసుకునేవారు.

కొందరు భక్తులు శ్రీబాబును ప్రశ్నించారు. "మీరు ముక్త పురుషులు కదా! ఎందుకు పూజ చేస్తారు?'' అని. "అది మీకు అలవాటుచేయటానికి'' అని చెప్పేవారు.

పూజ చెయ్యాలంటే శుచి ఎంతో అవసరం. శ్రీబాబు మనకు చేసి చూపించారు. నిష్టగా మనస్సు పెట్టి పూజ చేస్తే అది మనసులో నిలుస్తుంది. ప్రయాణంలో ఉన్నా పూజ సమయానికి ఈ పూజ ప్రక్రియను భావించుకుంటే అదే మానసిక పూజ అవుతుంది. అది బాహ్యపూజ కంటే ఎన్నో రెట్లు శ్రేష్ఠం.

# శ్రీకృష్ణ కర్ణామృతం

(గతసంచిక తరువాయి) -సుశీలా ప్రసాద

నాదైన ఈ రూపంతోనే నేను నందుని లోగిలి చేరాను. వాకిట్లోనే ఎదురైంది యశోదమ్మ. ఆమెను చూసి నాలో ఆనందం ఉప్పొంగింది. ఆ తల్లి మహద్భాగ్యానికి కళ్ళు చెమ్మగిల్లగా "అమ్మా!" అని పిలిచేసరికి, ఆమె రవంత తడబాటుతో "ఎవరయ్యా నువ్వు?" అన్నది. "నీ నోముల పంట, నీ వరాల మూట అయిన నీ బిడ్డడు కుశలమే కదా! ఆ పసివాడు ఇప్పుడేం చేస్తున్నాడమ్మా?"అన్నాను చూడలనే ఆత్రం తొందర చేయగా.

నా భిక్షుక వేషం చూసి ఆమె బెదరిపోయి నట్లుంది. "నువ్వు భిక్షగాడివా? లేక మాయావేషధారివైన అసురుడివా? బిచ్చమెత్తుకో వస్తే నీకు నా బిడ్డ సంగతి ఎందుకయ్యా?" అంటూ నన్నక్కడే నిలదీసింది. ఆమె అనుభవాల తాలుకూ భయం మనస్సంతా అలుముకుని ఉంది కాబోలు పాపం మరి.

"అమ్మా! లేక లేక కలిగిన నీ బిడ్డడు ఎంతో చక్కనివాడని విని, ముచ్చట పడి చూడవచ్చాను తల్లీ! నేను ఏ హానీ కలిగించను. ఒక్కసారి నీ పాపడని చూపితే చాలు. ఇంకేం వద్దమ్మా!" అని బ్రతిమాలుకున్నాను.

కానీ ఆమె పసివాడు నిద్రపోతున్నాడనీ, అలికిడైతే లేచిపోతాడనీ, సద్దుసేయక సాగిపొమ్మని నన్ను అదిలించి వేసింది. కావాలంటే బిచ్చం వేస్తానంది. నాకు దిక్కు తోచలేదు. వెనుదిరిగి పోయేందుకు మనసొప్పటం లేదు. కుహానా బాలుని చూడాలని మనస్సు తహతహలాడుతోంది.

"బావా! ఎన్నో సందర్భాలలో నువ్వే ఉపాయం చూపావు గదయ్యా!" అనుకున్నాను గతం తలచి. ఆ క్షణానే గల్లుమన్న శబ్దం వినవచ్చింది. యశోదమ్మ ఉలిక్కిపడి వెనుదిరిగి చూసింది. నేను ముందుకి చూశాను.

ద్వారబంధాన్నానుకుని నిలచి ఉన్నాడు కన్నుల పండువగా యశోదా తనయుడు. చేతిలో బంగారు గిలకపండు. "అమ్మా! నేను నిద్రపోయాననుకుని నువ్వీ తాతతో అసత్యం చెప్పావేమోను, నేను మెలకువగానే ఉన్నాను అని నిజం చెప్పటానికి వచ్చాను. నువ్వు జోలపాట పాడటం ఆపేసరికి, నాకు అప్పుడే మెలకువ వచ్చేసిందమ్మా. నీకోసం చూస్తుంటే ఎంతకీ నువ్వు రావటంలేదు. అందుకే ........ఔనూ! ఈ తాత ఎవరమ్మా? నా కెందుకో ఆయన్ని చూస్తే

యిష్టంగా ఉంది. నువ్వు కోప్పడనంటే నా గిలకగపండు ఆయనకివ్వనా?" గలగలమని మాట్లాడుతుంటే వింటూ ముగ్ధుణ్ణయి చూస్తూ నిలిచిపోయాను. ఆ రూపమూ, ఆ మధుర స్వరమూ, ఆ కాలి అందెల రవమూ అద్వితీయంగా ఉన్నాయి. బిడ్డ మాటలకి యశోదమ్మ ఏమీ చెప్పలేక, ఏమీ తోచని దానిలాగ ఉండిపోయింది.

అనురాగం మూర్తీభవించినట్లున్న ఆ దివ్య మంగళ విగ్రహుడు నా వంక నడచివచ్చి, నా చేతిని పట్టుకుని బంగారు గిలక నా చేతిలో పెట్టాడు. ఆ స్పర్శకి నా ఒళ్ళు జల్లుమంది. చిన్నగా నవ్వుతూ "ఈ గిలక నీ చేతి ఢమరుకమై అమరి, మ్రోగుతూ నిత్యసత్యవస్తు తత్త్వాన్ని ఎరిక గలిగిన వారికి చాటి చెప్పాలి. సరేనా! ఇక వెళ్ళి వస్తావా?" అన్నాడు.

యశోదమ్మకి ఆ మాటలు వినిపించినట్లు లేదు. రెండు చేతులూ జాచి, బిడ్డనెత్తుకుని గుండెలకి హత్తుకుంది. నా కార్యం నెరవేర్చినందుకు, హృదయంలో నిలిచిపోయిన ఆ విశ్వరూపునికి వందానలర్పిస్తూ వెనుదిరిగి వచ్చేశాను. ఆ దర్శనము, స్పర్శా భాగ్యము, సంభాషణమూ అవి నాకు జగద్గురువై నాకిచ్చిన వరాలనిపించాయి సుమా!".

పశుపతి తన దివ్యానుభవాన్ని మైమరచి వింటున్న మహర్షులను చూస్తూ, వారి మనోరథాన్ని, మనోగత భావాలను అద్దంపట్టినట్లు గమనించి, "మీరు మీ రూపాలతో వ్రజబాలుని దర్శించాలంటే మాత్రం నేను పడిన పాట్లే పడవలసి వస్తుంది. కనుక ఏదో మార్గాంతరం చూడండి. ఆందుకు ఆ నందనందనుడే స్ఫూర్తి నందించగలడు లెండి." అన్నాడు.

సాంబశివుని వాక్యాలు వింటూ ఆ దివ్యదంపతులను సెలవడిగి తమ గమ్యం వైపు నడిచారు మునీశ్వరులు.

- సశేషం.

ఇంటిలో ప్రవేశించిన దొంగ ఎవరికీ కనబడడు. కానీ అందరినీ చూస్తూ ఉంటాడు. ఇది దొంగయొుక్క లక్షణం. ఘోషాస్త్రీల దగ్గర కూడా యీ లక్షణం ఉంది. భగవంతుని దగ్గర కూడ యిదే లక్షణం ఉంది. అందుకే వేదం ఆయనను **' స్తేనానాం పతయే '** అన్నది.

# పరిప్రశ్నేన సేవయా

-పరాశర ప్రసాద్

శ్రీసద్గురుదేవులు విశాఖపట్నంలో భక్త సమావేశంలో బోధ చేస్తుండగా ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఫిలాసఫీ ప్రొఫెసర్‌గారు సందేహాన్ని లేవనెత్తుతూ "ప్రారబ్ధ కర్మ అనుభవించవలసినదేనా? దీనికి ఏదైనా నివారణోపాయం ఉన్నదా?'' అన్న ప్రశ్నకు సమాధానంగా బోధ చేస్తూ ....

శ్రీగురుదేవులు "మానవుడు తాను ఆచరించిన కర్మ ఫలితంగానే జన్మ సంప్రాప్తించింది''. తన వెంట తెచ్చిపెట్టుకున్న సంచితార్థమే తాను అనుభవించే ప్రారబ్ధ కర్మ అని చెబుతూ "మీరు ఫిలాసఫీ ప్రొఫెసర్‌గారు కదా మీకు అన్ని విషయాలు తెలుసు. మీకు తెలియనిది ఏమున్నది?

మీరు గృహస్థాశ్రమం స్వీకరించి వివాహము చేసుకుని మీ సంకల్ప ఫలితంగా పుత్రుని కన్నారు. కాని మీ పుత్రుడి సంస్కారాన్ని నిర్ణయించేది మీరు కాదుకదా!''

ఫిలాసఫీ ప్రొఫెసర్‌గారు మాట్లాడుతూ "అయితే గృహస్థాశ్రమం కన్న సన్యాసాశ్రమం యోగ్యమైనదంటారా? అన్న ప్రశ్నకు సమాధానంగా శ్రీగురుదేవులు బోధ చేస్తూ

"గృహస్థాశ్రమం రాజయోగం. శ్రేష్ఠమైనది. మోక్షాన్ని పొందటానికి షార్ట్‌కట్. సన్న్యాసాశ్రమం దుర్భరమైనది. అక్కడ స్వధర్మము ఉపాసనే. దారి మళ్ళితే పతనమే. కాని గృహస్థాశ్రమంలో తన స్వధర్మాన్ని నిర్వర్తించుకుంటూ, ఇంద్రియాలను అవసరమైన మేరకు ఉపయోగించుకుంటూ తగిన విధంగా నియంత్రించుకుంటూ, మనస్సుని తాను నమ్మిన దైవం ఆధీనంలో ఉంచి, ప్రశాంతమైన జీవితాన్ని గడపవచ్చు. గృహస్థాశ్రమంలో ఏమైనా లోటుపాట్లు ఉన్నా, సవరించుకునే అవకాశం ఉంది. తనతప్పును సరిదిద్దుకుని సత్యమార్గంలో ప్రయాణం కొనసాగించవచ్చు.''

శ్రీగురుదేవులు ఇంకా బోధను కొనసాగిస్తూ "ప్రారబ్ధ కర్మని రహితం చేసుకునే మార్గం ఉంది. సమర్థులైన సద్గురుమూర్తిని ఆశ్రయించిన తరువాత ఆయన ప్రసాదించిన లక్ష్యార్థ సాధన చేస్తే, ప్రారబ్ధ కర్మ రహితమవుతుంది. అందులో సందేహం లేదు. కాని సద్గురుమూర్తి చెప్పినదాన్ని ఆచరించగల్గిన

వాళ్ళు ఎంతమంది? ఓడ ఎక్కేవరకు 'ఓడమల్లయ్య' ఓడ దిగిన తరువాత 'బోడిమల్లయ్య' అనేవారే ఎక్కువ.

ఇప్పుడు అనుభవించే ప్రారబ్ధకర్మచే బాధపడేవారు సద్గురుమూర్తి ప్రసాదించిన లక్ష్యార్థాన్ని నిర్లక్ష్యం చేసి ఇంకా ఎక్కువ బాధలకు గురి అవుతారేమోనని గురుమూర్తి ఎంతో తపిస్తారు. పోనీ వక్రమార్గంలో వెళ్ళేవారిని సక్రమ మార్గంలో నడిపిందామని హెచ్చరిస్తే మనస్సు కష్టపెట్టుకుంటారు. ఏంచేయాలో చెప్పండి? సద్గురుమూర్తి తన బిడ్డ అభివృద్ధిలోకి రావాలని కోరుకుంటాడా? పతనమవ్వాలని కోరుకుంటాడా? మీరే ఆలోచించండి.

భగవానుడు మీకు జన్మని ప్రసాదించినది కర్మని రహితం చేసుకుని జన్మ రాహిత్యాన్ని పొందమన్నాడుకాని, నిప్పులో వేలుపెట్టి చెయ్యి కాల్చుకోమనలేదు కదా! దాని ఫలితాన్ని అనుభవించక తప్పదు కదా! కర్మరహితం చేసుకోవటానికి తప్పక మార్గం ఉంది'' అన్నారు.

ప్రొఫెసర్‌గారు తిరిగి ప్రశ్నిస్తూ "అసలు మానవుడు ఏ కర్మ చేయటం వలన ప్రథమంగా జన్మకి వచ్చాడు?'' అని అడిగారు.

శ్రీగురుదేవులు సమాధానం చెపుతూ భగవానుడు జీవకోటినంతా సృష్టించినట్లు నారాయణోపనిషత్తు చెబుతోంది. భగవద్గీత అదే బోధిస్తోంది. సృష్టికి వచ్చిన మానవుడు తాను ఎవరో, తన కర్తవ్యమేమిటో తెలుసుకోకుండా ప్రక్కదారి పట్టి దారి తప్పటం చేత జనన మరణ వలయంలోకి చొరబడ్డాడు.

ఒక పిల్లవాడిని బజారుకి పంపిస్తే తనను పంపించిన పని ఏమిటో మరచి గారడివాడు చేసే ప్రదర్శన చూడటంలో నిమగ్నమై ఇంటికి వెళ్ళటం మరచాడు.

చెట్టుపై నుంచి బయలుదేరిన పక్షి ఎక్కడ ఎక్కడో తిరిగినా తిరిగి గూటికి చేరవలసిందే కదా! మానవుడూ అంతే. దీనిని అర్థం చేసుకోండి'' అన్నారు శ్రీబాబూజీ మహరాజ్.

# శ్రీ బాబూజీ దివ్యవాణి

శ్రీ హనుమత్కాళీ ప్రసాదబాబు తమ ప్రసంగాన్ని ఇలా కొనసాగించారు :

మనం చెప్పుకుంటున్న పారిశ్రామిక సంపన్నుని పరిశ్రమను, ఇంతకు ముంచే వివరించిన మామిడిచెట్టు ఉదాహరణతో పోల్చవచ్చును. ఆరంభం నుండి ఎంతో శ్రద్ధతోను, ప్రేమతోను తగిన జాగ్రత్తలు తీసుకుంటూ ఆ పరిశ్రమను పోషించుకుంటూ వస్తే, అది ఒక మహా పరిశ్రమగా దేశంలోకల్లా పెద్ద సంస్థగా తయారై, అపార సంపద నివ్వగలదు. కోట్ల కొలది రూపాయల ద్రవ్యాన్ని సమకూర్చగలదు. లక్షలాది ప్రజలకు మేలు చేయగలదు. లేనివారిని ఉన్నవారుగాను, ఉన్నవారిని మరింత ఉన్నవారుగాను, ఇతరులకు ఇవ్వగలవారు గాను మార్చగలదు. కానీ, అదే పరిశ్రమను మొదట్లోనే నిర్లక్ష్యం చేసినా, కనీసం దానియందు సద్భావమైనా లేకపోయినా, ఆ యజమానికి, ఉద్యోగులకు, వారి కుటుంబాలకే గాక దేశ ఆర్థిక వ్యవస్థకే తీరని నష్టం తప్పదు.

తన సంస్థను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది, బహుళార్థ సాధకమైన మహాసంస్థగా రూపొందిచాలని కోరే యెడల ఆ పారిశ్రామిక సంపన్నుడు ఈ క్రింది విషయాలను సదా గుర్తుంచుకోవాలి. తన సంస్థలో తయారయ్యే వస్తువు దేశంలోనేగాక విదేశాలలో కూడా మెచ్చుకొనేటంత నాణ్యంగా ఉండాలి. సంస్థకు వచ్చిన కీర్తి శాశ్వతంగా ఉండటమే కాకుండా ఇంకా వృద్ధి పొందాలి.

తన సంస్థ మూలంగా దేశానికి కూడా కీర్తి రావాలి. తన సంస్థ వలన తన రాష్ట్ర ప్రభుత్వానికీ, కేంద్ర ప్రభుత్వానికి కూడా ఎన్నో విధాల అదాయం లభిస్తుంది.

అనేకవేల మంది కార్మికులు ఉద్యోగులు ఇంకా అనేక వేలమంది వారి కుటుంబ సభ్యులు జీవనోపాధికి, తమ అభ్యున్నతికి ఈ సంస్థపై ఆధారపడి ఉన్నారు.

తన సంక్షేమమూ, తన కుటుంబ సంక్షేమమూ కూడా ఈ సంస్థతో ముడిపడి ఉన్నాయి.

తన కుటుంబ సంక్షేమ సౌభాగ్యాలే కాక, ఆ సంస్థలోని ఉద్యోగులందరి కుటుంబాల సంక్షేమ సౌభాగ్యాలు, ఆ సంస్థ యొక్క సంక్షేమ సౌభాగ్యాలు కూడా కేవలం తన మీదనే ఆధారపడి ఉన్నాయి.

తన సంపద, ఐశ్వర్యం తనది మాత్రమే కాదు; అది దేశానిదీ, దేశ ప్రజలదీ కూడా. ఈ బాధ్యతలే కాక, ఇంతకంటే గురుతరమైన ఒక ఆధ్యాత్మిక బాధ్యత కూడా తనపై ఉన్నది. ఈ మహాసంస్థకంతటికీ అసలైన యజమాని భగవంతుడు. తాను ఆయన తరపున పనిచేస్తున్న ప్రతినిధి మాత్రమే. తన సంస్థ అత్యుత్తమ ఫలితాలను సాధించడానికి, అత్యధిక లాభాలను పొందటానికి తాను శాయశక్తులా కృషి చేయాలి. కాని లభించే ఫలితాలు భగవానుని కృపవల్లనే అని గుర్తుంచుకోవాలి; ఆ లాభాలను భగవంతుడు మెచ్చేవిధంగా వినియోగించాలి.

పైన చెప్పిన విషయాలన్నీ గమనిస్తూ, అలా ఆచరిస్తూనే తాను ధర్మబద్ధంగా సంపాదించిన ద్రవ్యంలో వీలైనంత మిగిల్చి, దానిని దైవకార్యాలకు, ధర్మకార్యాలకు వినియోగించినప్పుడే, తన యజమాని అయిన భగవంతుని పట్ల తాను తన విధిని నిర్వహించినట్లు అవుతుంది.

-సశేషం

బుద్ధ భగవానుడు తన బోధామృతాన్ని నలుదిశలా వెదజల్లుతూ పర్యటిస్తున్న సమయంలో ఒక గ్రామానికి వచ్చాడు. పురప్రజలంతా స్వామిని దర్శించుకుని వాని మధుర వాక్కులను వినాలని బుద్ధుని సన్నిధికి చేరుకోసాగారు.

పట్టణ వీధులను శుభ్రంచేసే సేవకుడొకడు ఆ వార్త విన్నాడు. అతనికీ స్వామిని దర్శించాలనే ఆశ కలిగింది. కానీ వీధులను శుభ్రం చేసి, పనిపూర్తి అయ్యాక వెళ్ళాలనుకుంటుండగా రోజులు గడిచిపోయాయి. ఇక బుద్ధుడు ఆ తావు నుండి తరలిపోయే సమయం వచ్చిందని విని వాని మనస్సులో ఆందోళన కలిగింది. అయినా పనిపూర్తికాక వెళ్ళలేక, స్వామిని చూడలేక పోయానని తపించి పోతుండగా, చివరికి వంగి చెత్తను తొలగించివేస్తున్న వాని ముందు రెండు దివ్య పాదారవిందాలు నిలిచి కనిపించాయి. తలెత్తి చూడగా అమృతమూర్తి అయిన బుద్ధ భగవానుడు ! 'నీకోసం నేనే వచ్చాను' అన్న ఆ దివ్యమూర్తి పలుకులు వింటూ, సేవకుని మనస్సు ఆనందంతో నిండిపోయి కనుల వెంట జాలువారిన ఆనందబాష్పాలతో స్వామి పాదాలను అభిషేకించాడు ధన్యుడైన సేవకుడు.

మనస్సులో మాలిన్యమంతా పూర్తిగా తొలగించుకుంటే ఆ నిర్మలాంతఃకరణ మందు భగవానుడు తప్పక వచ్చి నిలుస్తాడు. -గౌతమబుద్ధుడు

# భగవత్సాక్షాత్కారము

ఆంగ్ల మూలము - జయ దయాళ్ గోయంకా          తెలుగు సేత - రమణ ప్రసాద్

నిర్మలమైన, నిష్కళంకమైన ప్రేమయే భగవత్ప్రాప్తికి సాధనము. ఈ ప్రేమను ఎలా సాధించాలి? ఏ ప్రేమ తత్వం ద్వారా భగవత్ సాక్షాత్కారం భక్తునికి కలుగుతుందో ఆ ప్రేమ తత్వం ఎటువంటిది?

ఎవరైతే భగవంతుని మనస్సులో నిలుపుకుని ధ్యానిస్తారో వారికి భగవంతుడు సగుణరూపంలో ప్రత్యక్షమవుతాడు. ఏ అడ్డంకులను లెక్కించక నిర్మలమైన మనస్సుతో ధ్యానించాలి. ధృవుడు అలా తపస్సు చేసి భగవత్సాక్షాత్కారాన్ని పొందాడు.

ఎవరైతే ఎన్ని కష్టములైనా సహించి, ఎన్ని యాతనలైనా అనుభవించి భగవన్నామాన్ని ధ్యానిస్తారో వారికి భగవంతుడు నిజ స్వరూపంతో దర్శనం యిస్తాడు. మరణ యాతనలు పెట్టినా సహించి, చావుకైనా సిద్ధపడి భగవంతుని ధ్యానించిన ప్రహ్లాదుడు దానికి తార్కాణము. ఎవరైతే తను మన ధనాలను భగవానునికి అర్పిస్తారోవారికి భగవద్దర్శనం కలుగుతుంది. తన సర్వస్వాన్నీ, భార్యనీ విడిచి శ్రీరామచంద్రునితో కాననముల కేగిన లక్ష్మణునికి భగవత్ప్రాప్తి కలుగలేదా? ఏ రీతిన సుతీక్ష్ణ ముని భగవంతుని కొరకు తిరిగాడో, అటువంటి వానికి భగవంతుడు దర్శనమిస్తాడు. సంత్ తులసీదాసు తన 'రామచరిత మానస్' లో యీ ఉదంతాన్ని ఇలా వివరించాడు...

సదాశివుడు ఆ మునీశ్వరుడు ఏ విధంగా భగవత్ ప్రాప్తికై పరితపించాడో చెబుతున్నాడు. "రామచంద్రుని దర్శనమునకై పరితపిస్తూ ఆ మునీశ్వరుడు ఎటు నడుస్తున్నదీ తెలియని స్థితిలో ఉన్నాడు. ఒకసారి వెనుకకు తిరుగుతాడు. తాను వచ్చిన దానికి అభిముఖంగా పయనిస్తాడు. మరల తిరిగి వచ్చి తాను వచ్చిన తోవనే వెళతాడు. ఒక్కొక్క సమయాన తన్మయత్వంతో నాట్యం చేస్తూ ప్రభువును కీర్తిస్తాడు. శ్రీరామచంద్రుని యెడల అతని భక్తి అంత ప్రగాఢమైనది. భగవంతుడు (శ్రీరామచంద్రుడు) యీ అలౌకిక దృశ్యాన్ని ఒక చెట్టుచాటు నుంచి తిలకించి పరవశుడౌతాడు. ఒక్క క్షణమైనా జాగు చేయక ఆ భక్తుని యెదుట ప్రత్యక్షమయ్యేటట్లు భగవంతుని యెడల అతని ప్రేమ బద్ధుడిని చేసింది.

ప్రథమంగా మనోనేత్రంతో భగవానుని దర్శించి ఆ దారి ప్రక్కన శిలా ప్రతిమవలె చలనం లేకుండా కూర్చున్నాడు. అతని శరీరం ఆనంద పారవశ్యంతో గగుర్పాటు చెందినది. రఘురాముడు అతి ప్రసన్నుడై అతనిని సమీపిస్తాడు. పారవశ్యంతో ఉన్న మునిని సమీపించి అతనిని తపస్సు నుండి మేల్కొలిపి అతన్ని మృదుమధుర వచనములతో ప్రేమగా పలుకరిస్తాడు.

శరణాగతి చేత భగవంతుని ముఖాముఖీగా హనుమంతుని వలె దర్శించవచ్చు. ప్రగాఢమైన ప్రేమతో భగవద్దర్శనం కొరకు తపించి, భగవానుని దర్శనం పొందిన భరతుని స్థితి కనులకు కట్టినట్లు వర్ణన చేశాడు. అరణ్యావాసం అనంతరం రామచంద్రుడు అయోధ్యకు వేంచేయనున్న సమయంలో అయోధ్యలో భరతుని ప్రేమ పరాకాష్ట నొందిన ప్రేమావతారుడిగా వర్ణించాడు.

శ్రీరామచంద్రుడు నిర్ణీత కాలం కంటె ఒకరోజు తరువాత వస్తున్నందుకు ఎంతగానో విలపించాడు. అయితే దానికి కారణం తను ఒకరోజు లెక్కలోకి తీసుకోకపోవటమే. తాను లెక్కించిన నాటికి శ్రీరాముడు రానందుకు ఎంతగానో కలత చెందాడు. "నా రాముడు నన్ను మరచిపోయాడా! ఏల రాడు? తన కుటిల స్వభావం వలన కాదుకదా!".

శ్రీరాముని చరణారవిందములపై నిలిపిన లక్ష్మణుని ప్రేమను తలచుకొని ఒక్కింత యీర్ష్య చెందాడు. "తన కుటిలత్వాన్ని భగవంతుడు ఎరిగి ఉన్నాడు కనుకనే తనను తనతో (రామునితో) తీసుకొని వెళ్ళలేదు. తనలోని లోపములను చూపెట్టి తనను నిరాకరించి ఉంటే కల్పాంతరాలైనా, ఎన్ని యుగాలైనా, ప్రపంచ వినాశమైనా తాను రాముని చరణ సన్నిధిని చేరుకోవటం దుర్లభం. అయితే భగవానుడు ఎన్నడూ భక్తుల లోపాలను గమనించడు. ఆర్త జన రక్షకుడు, భక్తజన పరిపాలకుడు, కరుణామూర్తి శ్రీరామచంద్రుడు. కనుక తనను తప్పక కలుస్తాడు. అటువంటి శుభసూచనలు కనిపిస్తున్నాయి. నిర్ణయించిన గడువు కంటె ఒక్క క్షణం జీవించినా తనకన్నా పాపి ఇంకొకరు ఉండరు."

ఈ విధంగా భరతుడు కుంగిపోతున్న తరుణంలో హనుమంతుడు ఒక బ్రాహ్మణుని వేషంలో భరతుని సమీపించాడు. మునిగిపోతున్న వానిని రక్షించే నావవలె.

-సశేషం

# గురు సన్నిధి

-పరాశర ప్రసాద్

ఆనాటి సత్సంగ సమావేశం జరిగేటప్పుడు వడాలిపిన్నిగారు కూడా వచ్చారు. ఈ సమావేశాలు తరచుగా రాత్రిపూట జరిగేవి. కాల నిర్ణయం ఉండేది కాదు. కొన్ని సందర్భాలలో అర్థరాత్రి వరకూ కొనసాగేవి. శ్రీసద్గురు దేవులు సాధకులకు ఉపయుక్తమైన అనేక సూచనలను అందజేసేవారు.

వడాలిపిన్ని గారిని పిలిచి "పిన్నీ! ఏమైనా విశేషాలు చెప్పు. వీరంతా వింటారు" అన్నారు. వడాలిపిన్నిగారు మాట్లాడుతూ "మీరు ఏమైనా చెబితే విందామని వచ్చాను బాబూ, అంతేకాని నేను చెబుదామని రాలేదు" అన్నారు.

శ్రీగురుదేవులు వెంటనే కలుగజేసుకుని "ఛీ! ఎంతకాలమైనా ఇంతే. నీ జుట్టు మెరిసిందిగాని, మనస్సు మెరవలేదు. పూర్ణాధికారివి. జ్ఞాని అని చెప్పుకుంటావు నీ జ్ఞానాన్ని వీరికి అందజేయి" అన్నారు. "మా నాన్నగారు దేహత్యాగం చేసినప్పుడు మీరంతా కలసి నాకు జ్ఞానబోధ చేశారేమో! అదంతా చెప్పు ఇప్పుడు వీళ్ళు వింటారు."

వడాలిపిన్నిగారు కలుగజేసుకుని, "మీరు నాన్నగారి గురించి బాధ పడుతుంటే, మేమంతా కలుగుజేసుకుని ఆయన గురించి ఎందుకు అంత బాధపడతారు. ఆయన జ్ఞాని. జ్ఞానం నశించేది కాదు కదా! ఆయన భౌతికంగా అదృశ్యమైనా నిర్గుణంగా ఎక్కడికి వెళ్ళారు? అని చెప్పాము" అన్నారు.

శ్రీగురుదేవులు మాట్లాడుతూ "మరి నాకు అంత బోధ చేసిన జ్ఞానులైన మీరంతా నన్ను అక్కడ నుంచి వెళ్ళే ముందు ఏమని కోరారు?" అని అడిగారు.

పిన్నిగారు సమాధానం చెబుతూ "రాజమండ్రి జయంతులకు తప్పకుండా రమ్మని అంటూ నాపైన పుత్రవాత్సల్యం చూపిస్తావు కదూ! అన్నమాట నా మనస్సులో నిలిచిపోయింది" అన్నారు.

శ్రీగురుదేవులు కలుగజేసుకుని "అంత మనస్సులో నిలుపుకున్న దానివి నా గురించి ఎన్నడూ మనస్సులో బాధపడలేదా? అవన్నీ చెప్పు వీళ్ళు వింటారు" అన్నారు.

"రాజమండ్రి జయంతుల్లో ఉపన్యాసాలు ఇవ్వటం, తీర్థ ప్రసాదాలు ఇవ్వటం మినహా మాతో మాట్లాడేవారు కాదు. మమ్మల్ని చూసి విసుక్కునేవారు. ఎప్పుడైనా ఎదురుపడితే ప్రక్కవారితో మాట్లాడుతూ "వంటల్లో ఉల్లిపాయలు, వెల్లుల్లిపాయలు ఎక్కువగా వేయండి'' అనేవారు.

శ్రీబాబూజీ కల్పుజేసుకుని "చూశావా పిన్నీ! పూర్ణాధికారివి. నీలో ఎన్ని వాసనలు ఉన్నాయో అవన్నీ పోవాలి కదా! సరేలే! ఎక్కడో అక్కడ కలుసుకుందాం" అని నేను అన్నాను కదా! ఇక్కడ ఈవిధంగా కలుసుకున్నాం. నా బాధ్యత నేను విస్మరించానా ఆలోచించు. నువ్వు చీటికిమాటికి వడాలి పని ఉంది వెళ్ళాలని నాకు కబురుపంపటం యదార్థమేగా! నేను వద్దన్నానని వడాలిలో మీ బంధువులకుగాని, ఆఖరికి నీ కొడుకుకి కూడ ఉత్తరము వ్రాయటం మానివేశావు. అది వైరాగ్యంతో కాదు. నామీద కోపంతో. యదార్థమే కదా! చివరికి నా గదికి వచ్చి 'ఇంక ఎక్కడకీ వెళ్ళను, క్షమించ'మని నా పాద నమస్కారం చేసుకున్నావు. అయితే 'ఒక మూలపడి ఉండు' అని నేను అన్నాను. ఇంతకీ ఎనమదుర్రులో గాని, భీమవరంలోగాని ఉన్నప్పుడు నీలో ఉన్న చాంధసపు ఆచారాలు, వాసనలు ఇక్కడ ఆశ్రమానికి వచ్చిన తరువాత తగ్గాయా? పెరిగాయా? చూశారా! అనుకోకుండా ఎన్ని విషయాలు బయటకి వచ్చాయో! ఇదే సత్సంగం అంటే. సద్గురుమూర్తి ఏ పని చేసినా అది సాధకునికి అనుకూలమేగాని ఇంకేమీకాదు'' అన్నారు శ్రీబాబు. *

## తప్పు నీదే!

"అన్నా! అంత కష్టంలో పిలిస్తే అంత ఆలస్యంగా వచ్చావేమిటి?" అని నిష్ఠూరంగా అడిగింది ద్రౌపది.

"నువ్వు, 'కృష్ణా! ద్వారకావాసా!' అని పిల్చావు. అంత దూరం నుంచి రావద్దూ? అదే నీవు 'కృష్ణా! మమ హృదయ నివాసీ!' అని పిల్చిఉంటే వెంటనే వచ్చేవాణ్ణి గదా? మరి తప్పు నీదే! నాది కాదు" అన్నాడు శ్రీకృష్ణుడు.

# సమర్ధ సద్గురు నాధుని దివ్య చరిత్ర

(గత సంచిక తరువాయి)

- విజయేశ్వరానంద ప్రసాద్

ఆ మరునాడే శ్రీ బాబు మొదటిసారిగా యనమదుర్రు వచ్చారు. మేకల సూర్యారావు గారి యింటి వద్ద గ్రామస్థులకు దర్శనమిచ్చారు. శ్రీ బాబు భోజనానికి పరశురామయ్యగారి యింట్లో ఏర్పాటు జరిగింది. ("తొలి పరిచయాలు" అధ్యాయంలో "యనమదుర్రు" లో చూడండి.)



ఆ రోజు పరశురామయ్య గారు తమ పెన్షన్ తెచ్చుకోవటం కోసం బెజవాడ వెళ్ళారు. ఇంట్లో వారి శ్రీమతి చుక్కమ్మగారు మాత్రమే ఉన్నారు. వారు శ్రీ బాబును యింటిలోనికి ఆహ్వానించారు. సావిట్లోకి వచ్చిన శ్రీ బాబుకు ఎదురుగా ఉన్న గోడపై పరశురామయ్య గారి ఫొటో కనిపించింది. ఫొటో వంకనే తదేక దీక్షతో చూస్తున్న శ్రీ బాబు "వీరు జీవన్ముక్తులు. వీరికి మళ్ళీ జన్మ లేదు" అన్నారు. ఆ ప్రక్కనే, ఏడాది పిల్లవాడైన పరశురామయ్యగారి మనుమడు రమణ బాబు ఫొటో చూసి, "యీ కుర్రవాడికి చదువు పూర్తి అయ్యే సమయంలో చాలా ప్రమాదకరమైన జబ్బు చేస్తుంది. కాని అతను కోలుకొని బుద్ధిమంతుడై, పై చదువు చదువుకొని, పెద్ద ఉద్యోగం చేస్తాడు" అన్నారు.

( రమణ బాబు 1941 లో పుట్టాడు. దీన్ని బట్టి శ్రీ బాబు 1941 - 42 ప్రాంతంలో మొదటిసారిగా యనమదుర్రు వచ్చి ఉండవచ్చును. )

"కూర్చోండి బాబూ! ఎక్కడి నుండి వస్తున్నారు? తమరి నామధేయం?" అని అడిగిన చుక్కమ్మగారితో , శ్రీ బాబు "అమ్మా! నా పూర్వాశ్రమాన్ని గురించి నన్నడగవద్దు. కరుణామయి అయిన జగజ్జనని శ్రీ కాళీమాత అందిస్తున్న జ్ఞాన క్షీరములు గ్రోలుతూ, ఆ తల్లి ఒడిలోనే జీవిస్తున్నాను. ఇప్పుడు తమరు నన్ను పిలిచినట్లుగా 'బాబూ' అని పిలిస్తే చాలు. లేదా, 'ప్రసాద బాబూ' అని పిలవండి. ఇటువైపుగా ప్రయాణం చేస్తూ , యిక్కడ ఆగవలసి వచ్చింది.

నా కోసం తమను శ్రమ పెట్టక తప్పలేదు'' అన్నారు. "అదేమిటి బాబూ? 'అభ్యాగతస్స్వయం విష్ణుః' అన్నారు పెద్దలు. మీరిక్కడ నిరభ్యంతరంగా ఎన్ని రోజులైనా ఉండవచ్చును'' అని చుక్కమ్మగారన్నారు.

శ్రీ బాబుకు చుక్కమ్మగారు కాళ్ళు చేతులు కడుక్కోవటానికి నీళ్ళిచ్చారు. తమకు వంటింట్లో వడ్డించాలా, సావిట్లోనా అని చుక్కమ్మగారు తటపటా యిస్తున్నట్లు గ్రహించి, శ్రీ బాబు "అమ్మా! నాకు యిలా సావిట్లోనే వడ్డించండి" అన్నారు. "మీరెవరండీ?'' అని చుక్కమ్మగారు అడిగేశారు. "అది తెలుసుకోవటానికే నేను దేశమంతా యిలా పర్యటిస్తున్నానమ్మా. 'నేను' ఎవరో తెలుసుకుంటే, యిక మీకూ, నాకూ యీ తటపటాయింపులూ, సందేహాలూ ఉండనే ఉండవు'' అన్నారు. ఈ జవాబుతోనే వారు మహనీయులని గుర్తించినా, తమ మడి, ఆచారాలను వదులుకోలేక, చుక్కమ్మగారు శ్రీ బాబుకు సావిట్లోనే వడ్డించారు. తమ భోజనం ముగించిన పిదప, శ్రీ బాబు తమ విస్తరిని తామే తీసి పారవేసి వచ్చారు. 'స్థల శుద్ధి చేస్తానమ్మా' అని శ్రీ బాబు అంటే, చుక్కమ్మగారు పేడ నీళ్ళు తెచ్చి చిలకరించారు. శ్రీ బాబు శుద్ధి చేశారు.

తరువాత కొంత కాలం వరకు చుక్కమ్మగారు యిలానే శ్రీ బాబుతో శుద్ధి పెట్టించేవారు. వారి చెల్లెలు కందర్ప సుబ్బమ్మగారు (వారిని శ్రీ బాబు 'పిన్ని' అని పిలిచే వారు) కూడా అలా శ్రీ బాబుతో శుద్ధి పెట్టించిన వారిలో ఒకరు. శ్రీ పరశు రామయ్యగారు వాళ్ళను చివాట్లు పెట్టి , ఆ పద్ధతి మాన్పించారు. ఆశ్రమ స్థాపన తరువాత శ్రీ బాబు 'పిన్ని' ని సభలో నుంచో బెట్టి , "ఏం పిన్నీ? నిజమా, కాదా?'' అని అడిగితే పిన్నిగారు లెంపలు వేసుకుంటూ, "ఆ మహాపాపం చేసిన మాట నిజమే బాబూ'' అనేవారు.

ఇక్కడే కాదు - యింకా అనేక చోట్ల, ఎందరెందరి యిళ్ళలోనో, శ్రీబాబు భోజనానంతరం వారి చేత చాలా కాలం వరకు సాధనకాలంలోను, ఆ తరువాత కూడా స్థల శుద్ధి పెట్టించిన వారున్నారు.

శ్రీ బాబు తమ నివేదన ముగించిన కొద్ది సేపటిలోనే, పరశురామయ్య గారు వచ్చారు. వారు శ్రీ బాబును దర్శించిన క్షణంలోనే, తమ ఉపాస్య దైవమైన శ్రీ బాల రామునిగా గుర్తించారు. శ్రీ బాబును గాఢంగా కౌగలించుకొని, చిరకాల పరిచితుల వలె, పరశురామయ్యగారు ఆనందంలో మునిగి పోయారు. ''రామా! రామా!'' అంటూ వారు శ్రీ బాబును ఆనందాశ్రువులతో అభిషేకించుకున్నారు.

ఆ విధంగా పరశురామయ్యగారికి శ్రీ బాబుతో, యీ ఉపాధిలో, ప్రథమ సమాగమం జరిగింది. అది ఎన్ని జన్మల అనుబంధమోగాని, సర్వ బంధ

విముక్తికరమైన ఆత్మీయ బంధము.

ఆరాత్రి శ్రీ బాబు శ్రీ పరశురామయ్య గారివద్ద శలవు తీసుకుని, తిరిగి మేకల సూర్యారావు గారింటికి వెళ్ళిపోయారు. ప్రతిరోజూ శ్రీ బాబు నివాసం, స్నానం, పూజ, పడక, అన్నీ సూర్యారావు గారింట్లో నే. భోజనానికి మాత్రం శ్రీ పరశురామయ్య గారింటికి వెళ్ళేవారు. ఎప్పుడు బయటకు వెళ్ళినా, తమ దేవతార్చనను వెంట తీసుకొనే వెళ్ళేవారు.

సూర్యారావుగారింట్లో శ్రీ బాబు ఉదయమే స్నానం చేసి, పూజకు కూర్చునేవారు. పూజగదిలోకి ఎవరినీ రానిచ్చేవారు కాదు. అలంకారానికి కావలసిన పూల దండలన్నీ శ్రీ బాబు స్వయంగా గుచ్చుకునేవారు. పూజకు కావలసిన యితర ఏర్పాట్లన్నీ మాణిక్యంగారి కూతురు పద్మావతి (పండుదొరగారి భార్య) సమకూర్చేది. ఆ దంపతులిద్దరూ యిప్పటికీ శ్రీ బాబును దైవ సమానంగా కొలుచుకుంటారు.

పూజ ప్రారంభానికి ముందే చాలమంది జనం శ్రీ బాబును 'ప్రశ్న' అడగటానికి వచ్చి కూర్చునేవారు. 'సిద్ధాంతి' గారని, 'సాధువు'గారని శ్రీబాబును పిలిచేవారు. తమ పూజ పూర్తి అయాక శ్రీ బాబు బయటకు వచ్చి, అందరికీ తీర్థము, ప్రసాదము యిచ్చేవారు. ఆ తరువాత, వచ్చినవారు ఎవరి సమస్యను వారు శ్రీ బాబుకు చెప్పుకునేవారు. శ్రీ బాబు ఎంతో ఓపికగా, ప్రేమతో వారు చెప్పినవన్నీ విని, ప్రతి ఒక్కరికీ వారి వారి సమస్యలకు పరిష్కారాలు సూచించేవారు. వ్రతాలో,దీక్షలో, పూజలో ఆచరించమని చెప్పేవారు. ఎటువంటి రుగ్మతలతో వచ్చిన వారికైనా ఔషధములు యిచ్చేవారు. ఏ డాక్టరూ కుదర్చలేని మొండి రోగాలు, వారి మందులతోను, తీర్థంతోను మటుమాయమయ్యేవి. ఇక గ్రహదోషములు, ప్రయోగములు, భూత, పిశాచాది బాధలు ఏ మహామాంత్రికుడూ కుదర్చలేనివి కూడా శ్రీ బాబు చక్కగా నయంచేసేవారు. కాని అదంతా జగన్మాత దయ అని, జగన్మాత చెప్పిన మందు మాత్రమే యిస్తున్నానని, ఆ తల్లి సూచించిన సలహాలనే అందిస్తున్నానని, తానొక పోస్టుమేన్‌గా అమ్మకు సేవ చేసుకునే వాడను మాత్రమే అని, అందరికి చెప్పేవారు. అందువల్ల ప్రజలకు వారిపై మరింత ప్రగాఢ విశ్వాసము, అభిమానము ఏర్పడేవి.

-సశేషం

## మౌనధ్యాన సప్తాహ శిబిరం

-రమణ ప్రసాద్

మహాత్ములతో పొందిన అనుభూతి మరుపురాని మధుర స్మృతులుగా ఉండిపోతాయి. 'నీకు కూడా అనిపించిందే అప్పుడు నేనూ అక్కడే ఉన్నాను" అంటారు. గురుదేవులు సర్వవ్యాపకులు. **గురోరన్యం న భావయేత్** వారిని మానవమాత్రులుగా చూడరాదు. గురుపాదాన్ని పరిపూర్ణంగా ఆశ్రయించిన భక్తుడు ఎవడైతే ఉంటాడో, పరిపూర్ణంగా ఆశ్రయించి నమ్మినవానికి ఆ కనెక్షన్ లూజ్‌గా ఉండదో, ఆ కనెక్షన్ డైరెక్టే! అది తల్లికి బిడ్డకు గర్భంలో ఉన్న కనెక్షన్ లాంటిది.

కమ్మని పాలు కాచినా, నువ్వొస్తావని దాచినా
నీవేమూలను దాగినా, నా అనురాగం దాగునా

కమ్మని పాలు - ఆయనే ఇచ్చేది. ఈ సృష్టి వారిదే ! అన్న భావనలో ఉంటే కమ్మని అనుభూతి కలుగుతుంది. ఆ అనుభవాన్ని గురుదేవులకే విన్నవించుకోవాలి. కనురెప్పపాటు కూడా ఎడబాటు భరించలేనిది గురుదేవుడొక్కడే. ప్రార్థన సాకారము. ధ్యానము నిరాకారము అని చెప్పుకొన్నాము కదా! ప్రార్థనలో పాడే విషయం మీద మనస్సు ఏకాగ్రత చెందకపోతే ఫలితం ఉండదు. మనం సుప్రభాతంలో పాడుకుంటాము రోజూ ..... "ఆచరణలేని వాచావేదాంతము అంతట నిండెను మేలుకో..." అని.

ఒక అనంతమైన శక్తి మనకోసమే, మనతోనే ఉన్నది. ఆ ఒక్కదాన్ని మనం ఆశ్రయిస్తే, అంటే వారికి ఇష్టమైనది మనం చేస్తే, అప్పుడు మన ధ్యేయం నెరవేరుతుంది. ఎవరికి ఇష్టమైన పని? అని ప్రశ్న వస్తుంది. గురుదేవులకు ఇష్టమైన పని చేయాలి. మరి మనం చేస్తున్నామా? చెయ్యకపోతే చెయ్యాలి.

భగవంతునికి ఇష్టమవ్వాలంటే భగవంతునికి ఇష్టమైన విధంగా మెలగాలి. సోమరితనం పనికిరాదు. సోమరితనం అజ్ఞానమే. HACTగా ఉండాలి. అక్కడే ఉంది ఆనందమంతా. ప్రార్థన మనస్సుపెట్టి చేస్తే నిరాకారంలో అది నిలబడుతుంది. బృందావననికి వెళ్ళాలంటే రామాలయంవైపు వెడతామా? గురుదేవుల పవర్ ఏ చక్రం మీద లేదు? పైనుంచి క్రిందికి ప్రకాశిస్తూనే ఉంది.

**మూలాధారం** క్రింద స్థానం విఘ్నేశ్వరునిది. ఆయనను ప్రార్థిస్తే ఏ విఘ్నం లేకుండా ధ్యానం జరుగుతుంది.

**అనాహతం** - హృదయ స్థానం. "హృదయబాబు" అని ముద్రవేసి పెట్టారు గురుదేవులు. గొంతు దగ్గర విశుద్ధ చక్రం. భావనా మాలిన్యం వదలి పరిశుద్ధ భావన కలిగి ఉండాలి. మాట్లాడేమాట పరిశుద్ధంగా ఉండాలి. ఒకరినొకరు **పరస్పరం భావయంతః**

**ఆజ్ఞాచక్రము** అంటే భ్రుకుటి స్థానం. అజ్ఞా అనాహత చక్రాలపై ధ్యానం చెయ్యాలి. కళ్ళని కష్టపెట్టకూడదు. కళ్ళు మూసుకుని ఆ చక్ర స్థానాలలో భావన చేయాలి. వెన్నెముక నిటారుగా ఉంచాలి. హృదయ స్థానం భావన చేయాలి.

గురుదేవులు అనేవారు " సినిమాకి వెళ్ళావని కోపం లేదయ్యా, మీరు డ్రింక్‌లు తాగుతూ నాకు ఇవ్వలేదే (చంటిపిల్లవాడిలాగా!) అని కోపం వచ్చింది" అని ఇంకా అనేవారు "నువ్వు స్నానం చేస్తూ నన్ను గుర్తుపెట్టు కున్నావా? అలా చేస్తే అది నాకు అభిషేకం అవుతుంది" - ఇలా సూచనలు ఇచ్చేవారు. అహంకారం ఉండకూడదు.

కాలు నెప్పి వచ్చింది బాబూ! అనుకుంటే ఆయనే కనిపిస్తారు. ప్రతి సన్నివేశంలోను, కదలికలోను ఉన్నది ఆయనే. దైవ ప్రార్థన చాలు -అని చెప్పారు. దాని అనుభూతిని మనస్సు పొందితే అది ధ్యానం అవుతుంది. ధ్యానం మనకు భిన్నం కాదు. ధ్యానపరమైన మార్గంలో వెళితేనే ధ్యానం. 'పర'కి వెళితే అది పరధ్యానం అవుతుంది.

శ్రీగురుదేవులు తమ బోధామృతంలో, ఏవి నిషేధించాలో మనకు సూచించారు. అవి ఈర్ష్య, అసూయ, ఓర్వలేనితనం, అసహనం. "ఇతరులకు విమర్శించకు. నిన్ను విమర్శించుకో. ఇతరులని విమర్శించి విషాన్ని మూటకట్టు కుంటున్నావు" అనేవారు. మనస్సులో దోషదృష్టిని మనస్సుచేతనే మాటిమాటికి మనస్సుకు చూపించాలి. అప్పుడు శిష్యుడి మనస్సు నిర్మలమవుతుంది.

నామము, నామి వేరుకాదు. లైటుని, కాంతిని విడదీయగలమా? ఆరూఢమైన విశ్వాసంతో గురుపాదాశ్రయం చేసి వారు చెప్పినట్లే చేస్తే... అక్కడే ఉన్నదండీ ఉన్నదంతా!

నీ మనోపుష్పంతో పూజచేయవయ్యా! అరువు పూలు ఎందుకు? శమ దమాది షట్కసంపత్తి అనే పుష్పాలతో పూజ చేయాలి. అట్టి షడ్గుణసంపత్తిని అలవరచ్చుకుని గురుదేవులను అలంకరించుకుంటే ఆయన ఆనందించి, మనలను అనుగ్రహిస్తారు. అదే ఏకత్వస్థితి. శ్రీగురుదేవులు అట్టి స్థితిని మనకెల్లరకూ ప్రసాదించెదరు గాక!!

# శత్రువుల పట్ల కూడా ఉదాత్తమైన కృప

-సుషుమ్న ప్రసాద

ధర్మరాజు వంటి సత్యార్థుడనే మహారాజు తిరుకోయిలూరును ముఖ్య పట్నముగా చేసుకొని (ఆ పట్నము తమిళనాడులో ప్రస్తుతము విల్లిపురం జిల్లాలో ఉన్నది.) చేది రాజ్యమును పాలించాడు. ఆ రాజు యుద్ధ కౌశలములోఆరితేరిన మహాయోధుడేగాక, నటరాజస్వామికి మహాభక్తుడు కూడ. నటరాజస్వామి యందు ఆయనకున్న భక్తి ఎంత ఉదాత్తమైనదంటే, ఆ రాజ్యమును దర్శించటానికి వచ్చే శివాచార్యులను (శైవ ఋషులను) యెంతో భక్తి శ్రద్ధలతో ఆదరంతో గౌరవించేవాడు. రాజప్రాసాద ద్వారాలు వారికెప్పుడూ స్వాగతం పలుకుతూనే ఉంటాయి. రాజుగారు రాజభవంతి ద్వారపాలకులకు తనను కలుసుకోవటానికి వచ్చే శివభక్తులెవరినీ అడ్డగించవద్దని ఆజ్ఞ జారీచేశాడు.

చేదిరాజ్యమునకు సమీపమున ఉన్న రాజ్యమును పాలించే ముక్తనాధుడనే రాజు చేదిరాజ్యమును తన రాజ్యంతో కలుపుకోవాలనే దురాశతో ఉన్నాడు. అందుకు చాలా బలీయమైన సమర్థవంతమైన ఆయుధసేనకు శిక్షణనిచ్చి, సత్యార్థను యుద్ధమునకు పురికొల్పాడు. సత్యార్థుడు ముక్తనాధుని పందెమునకు అంగీకరించి, యుద్ధ సన్నద్ధుడయ్యాడు. నటరాజస్వామి శరణాగతిని పొంది, సత్యార్థమహారాజు తన సైన్యము, ముక్తనాధుని సైన్యముకన్న తక్కువదైనా ధైర్యసాహసములతో ముక్తనాధుని సైన్యమును ఎదుర్కొని ఓడించాడు. యుద్ధములో పరాజయుడైనను, ముక్తనాధరాజు అనేకమార్లు చేదిరాజ్యముపై దండయాత్రలు చేశాడు. ప్రతిసారి పరాభవమే యెదురైంది. సత్యార్థ మహారాజు ప్రతియుద్ధములో విజయమును సాధించినను ఎంతో ఉదాత్తతతో ముక్తనాధుని రాజ్యమును కబళించకుండా, ముక్తనాధుడు తన రాజ్యమును పాలించుకొనుటకు అవకాశమిచ్చాడు.

ముక్తనాధుడు యుద్ధ ఓటమితో భంగపడి, కుట్రపన్ని సత్యార్థునిపై పగ తీర్చుకోవాలనుకున్నాడు. చేది రాజైన సత్యార్థునకు శైవఋషులపట్ల చాలా భక్తిప్రపత్తులున్నాయని వారిని గౌరవిస్తారని విని. ముక్తనాధుడు తన శత్రువునంత మొందించటానికి శైవ సన్యాసిగా వేషం ధరించిచాడు. కాషాయాంబరము ధరించి, నుదుట విభూతిరేఖలు తీర్చి, శరీరమంతా

విభూతిపులుముకొని, శిరోజములను పైకి ముడివేసి, శివోహం శివోహం అంటూ రాజప్రాసాదంలోకి ప్రవేశించాడు. ద్వారపాలకులు సాధువని తలచి అతనికి ప్రణమిల్లి లోపల ప్రవేశించుటకు అనుమతించారు

రాజుగారి ఆంతరంగమందిరము ప్రవేశించబోతుంటే రక్షకభటుడు దత్త దొంగ సన్యాసిని అడ్డుకొన్నాడు. 'మహారాజుగారు మహారాణిగారితో ఏకాంతంగా ఉన్నారు. కావున నేను వెళ్ళి అనుజ్ఞ తెచ్చేవరకు మీరు వేచిఉండ వలసినదని చెప్పాడు. కాని ముక్తనాధుడు అతని మాటలు వినిపించుకోకుండా "చూడు నేను మీ రాజుగారికి'శివాగమ' అనే పవిత్ర గ్రంథం బోధించటానికి వచ్చాను. నన్ను అడ్డగిస్తే రాజుగారు నిన్ను శిక్షిస్తారు" అంటూ అతనిని త్రోసిపుచ్చి రాజమందిరములోనికి దూసుకుని పోయాడు. సత్యార్థుడు ముని వేషధారిని చూసి ఆనందించి, ముకుళిత హస్తాలతో సాష్టాంగ దండ ప్రణామములు చేశాడు. ఆయనతో "ఓ మహర్షీ! ఈరోజు నేను చాలా అదృష్టశాలిని. మీరు దత్తునితో పవిత్ర గ్రంథము చదివి వినిపించటానికి వచ్చామన్న మాటలు విన్నాము. మీరు ఆసీనులై నాకు నా సతీమణికి ప్రబోధమును ప్రారంభించ"మన్నాడు

వెంటనే దొంగ సన్యాసి "ఓ రాజా! యీ పవిత్ర గ్రంథమును పురుషులు మాత్రమే వినవలయును. రాణీగారిని అక్కడ నుండి పంపివేయమని చెప్పాడు. వెంటనే రాణీగారు మందిరం నుండి లోనికి వెళ్ళారు. దత్తుడు చాలా చాకచక్యముతో శివాచార్యుని కృత్రిమ ఉద్దేశమును ఊహించి, అనుమానించి, రాణిగారు నిష్క్రమించగానే, చాలా జాగ్రత్తగా కాపలాకాయవలెనని, గవాక్షము గుండా తొంగి చూస్తున్నాడు. పుస్తకము తీసే మిషతో దొంగ సన్యాసి మూట విప్పి కరవాలమును తీసి, రాజుగారి కంఠముపై వేటువేయనుపక్రమించాడు. ఆ ఖాతుక దృశ్యకమును చూసిన రక్షక భటుడు దత్తుడు శరవేగముతో, ఆ దొంగ సన్యాసిపై దుమికి కుడిచేతితో గట్టిగా పట్టుకొని, మరొకచేతితో పడబోయే రాజుగారిని పట్టుకొనెను. దొంగ సన్యాసిని గట్టిగా బంధించేసరికి అతని శిరస్సున ఉన్న కృత్రిమ సిగ క్రిందపడి, దొంగసన్యాసి ముక్తనాధుడని గ్రహించెను. వెంటనే దత్తుడు "ఓరీ దుర్మార్గుడా! నీవు రాజుగారికి సాధుసత్తములపై ఉన్న ప్రేమను ఆసరాగా తీసుకుని, యీ దొంగవేషముతో రాజుగారిని సంహరించటానికి వచ్చావా" అని బిగ్గరగా అరచిశత్రువును దునుమాడుటకు సిద్ధమయ్యాడు.

-సశేషం

# వార్తలు- విశేషాలు

**25.95.2011 - శ్రీ గురుదశమి, హనుమజ్జయంతి నాడు పెదనింద్రకొలను ఆశ్రమశాఖలో జరిగిన పాదపూజామహోత్సవంలో అనేకమంది భక్తులు పాల్గొన్న దృశ్యం**





శ్రీ హనుమజ్జయంతినాడు విచ్చేసిన భక్తులు మహాప్రసాదం స్వీకరిస్తున్న దృశ్యం



10.6.2011 శ్రీ సుగుణ ప్రసాద మాతాజీవారి నాల్గవ పుణ్యారాధన రోజున శ్రీ సుగుణ ప్రసాద మాతాజీ వారి సమాధికి పూజ చేస్తున్న దృశ్యం



10.06.2011న ఆశ్రమానికి సేవలను అందిస్తున్న వారికోసం నూతనంగా నిర్మించిన ఆవాసములలో గృహప్రవేశం చేస్తున్న దృశ్యం




(గత సంచిక తరువాయి) -రమణ ప్రసాద్

గోపాలకులు ఇంక ఏమీ మాట్లాడలేదు. ఒకరినొకరు చూసుకుంటూ వారి దారిని వారు వెళ్ళిపోయారు.

చీకటి పడింది. కాళింది వద్దనుండి శంఖానాదం వినిపించింది. సమయాన్ని సూచిస్తూ కొట్టిన గంటల ధ్వనులు మారుమ్రోగాయి. ఉద్దవుడు తలుపులు తెరచి ఉన్న గుమ్మం వైపు చూశాడు. ఒక విశాల వృక్ష శాఖలు ఆ ఇంటి వసారాపైన ఒక తల్లి తన బిడ్డను నిమురుతున్నట్లుగా ఉన్నాయి. ఎక్కడో ఆవులను పాలు పిండుతుంటే పాత్రలలో పడే పాలధార శబ్దం వినిపిస్తోంది... ఆ ధ్వని... ఆ వృక్షం, అదే రాయాని ఇంటి ఇంట వసారా... ఆ శంఖానాదం... గోకులంలో ఏ మార్పూ రాలేదు.

ఆవుల అంబారవాలు తల్లి పొదుగులవద్ద పాలు త్రాగుతున్న లేగ దూడల కేరింతలు... ఏమీ మార్పులేదు... అయినా ఉద్దవుడు ఆగంతకుడే! అపరిచితుడే!

''ఎవరి కోసం వచ్చారు తమరు?'' అని రాయాని ఇంటి గుమ్మంనుంచి బయటకు వస్తున్న ఒక ప్రౌఢ స్త్రీ ఉద్దవుని చూసి అడిగింది.

ఉద్ధవుడు ఉలిక్కిపడ్డాడు. మసక చీకటి నుంచి ఆ స్త్రీ బయటకు వచ్చి ఉద్ధవుని ముందు నిలిచింది.

రాయానుడు...రాధ'' అన్నాడు ఉద్ధవుడు సంకోచిస్తూ. రాయానుడా...? ఆ స్త్రీ కనులు ఆశ్చర్యంతో విప్పారాయి. మీరు....మీరు... ఎక్కడి నుంచి వస్తున్నారు? రాయనుని స్వర్గవాసం అయి చాలాకాలం అయింది...''

ఉద్ధవుడు కనులు మూసుకొన్నాడు..... లోపలనుంచి వణుకు వస్తోంది... రాయానుని పార్థివ శరీరం అతని కనులముందు కదిలింది. ఇక రాయానుడు లేడు, నందబాబా కూడా లేడు... యశోదమాత కూడా పరమపదించి ఉంటుంది... కృష్ణుడు కూడా దేహత్యాగం చేశాడు... సంకర్షణ బలరాముడూ లేడు...అందరూ గతించారు.

ఉద్ధవుడు, ఆవృక్షము ఈ రెండూ ఒకరినొకరు చూస్తూ ఉండిపోయారు.

"అదిగో...రాధ"... ఆ ప్రౌఢ స్త్రీ నవ్వుతూ అంది. ఆమె ఇటే వస్తోంది" అంటూ కుడి వైపు చూస్తూ అంది. "రాధ వస్తోంది... పెద్దదైపోయింది... పతి మరణించాడు. అయినా పువ్వులు అలంకరించుకోవటం మానలేదు. చందన లేపనాలు వేసుకోవటమూ మానలేదు...ఎన్ని ఆభరణాలు పెట్టుకుందో చూడండి'

ఉద్ధవుడు అటు చూశాడు.

ఆమె రాధయే... ఈ ప్రౌఢ స్త్రీ చెప్పినట్లుగా వృద్ధురాలు కాదు. విధవరాలు కాదు... ఎన్నో ఏళ్ళ క్రిందట కాళింది ఒడ్డున రాసలీల చేసినప్పుడు ఎలా ఉందో అలాగే ఉంది.. కొంచెం కూడా తేడా లేదు.. ఆమె ధరించిన వస్త్రాలు ఆభూషణాలు, పుష్పమాలలు, చందన లేపనాలు అప్పటిలాగానే నవ్య నూతనంగా ఉన్నాయి.

ఆమె ముఖంలో దరహాసం వెల్లివిరుస్తోంది. ఆమె కళ్ళల్లో శ్రద్ధాభక్తులు ఉట్టి పడుతున్నాయి. ముఖంలో ఎక్కడా విషాద ఛాయలు లేవు. ఆమె ముఖంలో నిర్మలత సౌమ్యత వెల్లి విరుస్తోంది.

ఉద్ధవుడు స్తబ్ధుడైనాడు!

ఈ జరిగిన కాలం... ఒక మహాయుగం గడిచిందా? కాలం స్థంభించిందా? గోకులం, ద్వారక, హస్తినాపురం.. అన్నీ మారాయి.... భీష్మ పితామహుడు, వసుదేవుడు స్వయాన ఉద్ధవుడు, అశ్వత్థామ వీరందరిని కాలం కాటు వేసింది...

మరి కాలం రాధను ఏమీ చెయ్యలేదు. కాలప్రవాహానికి అస్పృశ్యంగా ఉండిపోయింది రాధ.

"రాధా..." అన్న స్వరం అస్పష్టంగా కంఠం నుండి వెలువడింది.

"ఎవరు ఉద్ధవుడా?" తిరిగి రాధ ప్రశ్నించింది. ఉద్ధవుడు నుంచున్న చోట చీకటిగా ఉంది. అతడు వస్తాడని రాధ కల్పనా మాత్రంగా కూడా అనుకోలేదు. అతని నోట వచ్చిన ఆ ఒక్క శబ్దం ద్వారా రాధ ఎలా కనుక్కోగలిగింది? ఉద్ధవుడు చకితుడైయ్యాడు.

అర్జునుడు విషాదయోగంలో ఉన్న స్థితిలోలాగ ఉద్ధవుడు రాధను అనిమిషనయనాలతో చూస్తున్నాడు. ఎన్నో సంవత్సరాల క్రింద కృష్ణుడే ఉద్ధవుణ్ణి గోకులానికి పంపాడు! కృష్ణ సందేశం వినిపించి తాను నందునికి, యశోదకు,

రాధకు ఇతర గోపికాస్త్రీలకు ఊరట కలిగించాడు. కృష్ణ విహీనమై, నిస్తేజమైన గోకులంలో ఉద్ధవుని స్నేహపూర్వకమైన సందేశంతో వారు నూతనత్వాన్ని పుంజుకొని ఆనందంతో నాట్యం చేశారు.

ఉద్ధవుడు చూశాడు. ఆ ప్రౌఢ, రాధను గురించి చెప్పినది సారవిహీనంగ తోచింది. ప్రౌఢ అక్కడ నుండి వెడలి పోయింది.

"రాధా!" ఉద్ధవుడు తనకు చేరువగా ఉన్న రాధను చూస్తూ అడిగాడు. "నువ్వు కుశలమే కదా?"

రాధ నవ్వింది - నిర్మలమైన ఒక చిరునవ్వు. ఈమె నవ్వులో కూడా ఏమీ మార్పులేదు. ఆమె దేహం నుండి చందన పుష్పాల సుగంధం వెలువడుతోంది.

నా క్షేమ సమాచారం అడుగుతున్నారా ఉద్ధవా? నిన్ననే గా మీరు కృష్ణుని సందేశం తీసుకుని మధురనుండి వచ్చినది అప్పుడు..."

"నిన్ననా?" ఉద్ధవుడు చకితుడైయ్యాడు. రాధ ఏమంటోంది? ఒక మహాయుగం గడిచిందని మరచిందా?

"ఎందుకు మరిచింది?" రాధ నవ్వింది. ఆమె నవ్వటంతో ఉద్ధవుని ముఖంలో కూడా నవ్వు విరిసింది.

మీరు బాగా పెద్దవారైనట్లున్నారు. చెప్పండి కృష్ణుని నుండి ఏ సందేశం తీసికొని వచ్చారు మీరు?

"అవును రాధ" అన్నాడు ఉద్ధవుడు నెమ్మదిగా "ఈసారి కూడా కృష్ణుడు నీకు సందేశాన్ని అందించే కార్యాన్ని నాకే నియమించాడు.... కృష్ణ సందేశం..."

"చెప్పండి ఉద్ధవా... వెంటనే చెప్పండి" రాధ మొదటి సారిగా ఆమె ముఖంలో ఆందోళన కనిపించింది.

"రాధా..." ఉద్ధవుడు భావవిభోరుడై ఆమె తలపై చేతినుంచి కృష్ణుడు... కృష్ణుడు అన్నాడు........" అంటూ ఆగిపోయాడు.

-సశేషం

Printed, Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL